
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 29 జూలై 2025

రెండు రోజుల్లో పి-4 మార్గదర్శుల మ్యాపింగ్: కలెక్టర్

మహారాణిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల్లో పి-4 మార్గదర్శుల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సేవకులు, ఇతర వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారిని గుర్తించి, బంగారు కుటుంబాలకు మ్యాపింగ్ చేయాలని సూచించారు. సమాజంలో ఆర్థికంగా స్థిరపడినవారు దిగువస్థాయిలో ఉన్న వారిని దత్తత తీసుకునేలా ప్రోత్సహించి తగిన సహకారం అందేలా చూడాలని ఆదేశించారు.

విశాఖలో ఫిర్యాదుల పరిష్కారం భేష్

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

- పీజీఆర్ఎస్‌లో పాల్గొని స్వయంగా వినతుల స్వీకరణ
- ఇక్కడ అవలంబిస్తున్న విధానాలు మిగిలినచోట్ల అమలు
- నగరానికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యం
- శాంతియుత వాతావరణం ఉండడంతోనే పెట్టుబడులు

విశాఖపట్నం/మహారాణిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహణ బాగుందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశంసించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పాల్గొన్నారు. సుమారు 2.30 గంటలపాటు స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలు వింటూ సంబంధిత అధికారులను వేదిక వద్దకు పిలిపించుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కేజీహెచ్‌లో ఏడాది క్రితం తొలగింపబడిన రోగిమిత్రలు వచ్చి తమ సమస్య చెప్పుకుని విలపించగా ఓదార్చారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టా మేరకు ప్లాటు చూపించలేదని చినముషిడివాడకు చెందిన దంపతులు ఫిర్యాదు చేయగా, సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తమకు తల్లికి వందనం పథకం వర్తించలేదంటూ మంత్రికి ... మిగతా 6వ పేజీలో


కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్. చిత్రంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్ ఉన్నారు

అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు

రోజుకు 40 నుంచి 50 ట్రాక్టర్లు తరలింపు


కృష్ణాపురంలో గోస్తనీ నదికి ఆనుకుని ఇసుక మేటలు తవ్వుతున్న దృశ్యం

- పద్మనాభం మండలం కృష్ణాపురంలో వైసీపీ నేత దందా...
- కూటమి నేతల అండ

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామ పరిధిలో గోస్తనీ నదికి ఆనుకుని అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. సర్వే నంబర్ 178 (ప్రభుత్వ భూమి)లో సుమారు పది రోజులుగా గ్రామానికి చెందిన వైసీపీ నేత, మాజీ ప్రజా ప్రతినిధి ఒకరు ఉదయం నుంచి రాత్రి వరకూ ఇసుక తవ్వి, తరలిస్తున్నారు. రోజుకు 40 నుంచి 50 ట్రాక్టర్ల ఇసుక విక్రయిస్తున్నారు.

ఈ ఏడాది మే నెలలో ఒకసారి తవ్వకాలు చేపట్టగా సచివాలయం, రెవెన్యూ సిబ్బంది వెళ్లి అడ్డుకున్నారు. మళ్లీ పది రోజుల క్రితం తవ్వకాలు ప్రారంభించారు. గత ప్రభుత్వంలో ఇసుక మేటలను తవ్వేందుకు యత్నించినప్పుడు కొందరు వైసీపీ నేతలు హెచ్చరించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మండల టీడీపీ నేతలు కొందరు అండదండలు అందించడంతో వైసీపీ నేతకు అడ్డుచెప్పే వారు కరువయ్యారు. పోలీసులపై ఒత్తిడి తీసుకురావడంతో అటువైపు ఎవరు వెళ్లడం లేదు. ఎవరైనా గట్టిగా అడిగితే ట్రాక్టర్‌తో తొక్కిస్తానంటూ బెదిరిస్తున్నట్టు చెబుతున్నారు.

ఇదిలావుండగా నదికి, పొలాలకు మధ్య గోడలా ఇసుక మేటలు రక్షణగా ఉంటున్నాయి. ఇప్పుడు ఇసుక తవ్వకుపోతే వరదలు వచ్చినప్పుడు నీరు పొలాలపైకి వచ్చేస్తుందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గోస్తని నదికి ఆనుకుని ఇసుక తవ్వకాలకు ఎవరికీ తాము అనుమతి ఇవ్వలేదని విశాఖ జిల్లా గనుల శాఖ ఏడీ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. తక్షణమే తవ్వకాలు నిలిపివేయాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూటమిలో కొలిక్కిరాని కసరత్తు

- స్టాండింగ్ కమిటీ అభ్యర్థులపై తర్జనభర్జన
- మేయర్, ఎమ్మెల్యేల భేటీ
- ప్రచారంలో పలువురి పేర్లు
- నేడు అభ్యర్థుల ప్రకటన, నామినేషన్లు దాఖలు

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎంపికపై 'కూటమి' కసరత్తు కొనసాగుతోంది. ఏ పార్టీకి ఎన్ని సీట్లు ఇవ్వాలనే దానిపై మేయర్ పీలా శ్రీనివాసరావు సోమవారం కూటమి ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులతో దసపల్లా హోటల్‌లో సమావేశమయ్యారు. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలు ఉండగా, వాటిలో బీజేపీకి ఒకటి, జనసేనకు ఒకటి కేటాయిస్తామని మేయర్, ఇతర టీడీపీ నేతలు ప్రతిపాదించారు. దీనికి బీజేపీ సమ్మతించినప్పటికీ జనసేన నేతలు మాత్రం తమకు రెండు స్థానాలు కావాలని పట్టుబట్టినట్టు తెలిసింది. మరోవైపు సోమవారం రాత్రి పదకొండు గంటల వరకూ టీడీపీ నుంచి పోటీకి దిగే అభ్యర్థులెవరో ఇంకా నిర్ణయించలేదు. నియోజకవర్గానికి ఒకరి పేరును ఎమ్మెల్యేలు/టీడీపీ ఇన్‌చార్జిలే సూచించాలని ... మిగతా 6వ పేజీలో

రైల్వే జోన్‌కు రెడ్ సిగ్నల్స్!

మూడడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి...

- ఇప్పటివరకూ విడుదల కాని గెజిట్
- ముందుకుసాగని పనులు
- జీఎంను నియమించినా కార్యాలయం లేదు
- డీపీఆర్ పంపిన ఆరు నెలలకు తీరుబడిగా కొర్రీలతో ఆమోదం
- రాయగడ డివిజన్‌లోకి అరకులోయ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను పట్టాలెక్కించడం రైల్వే పెద్దలకు ఇష్టం లేనట్టుంది. ఇది ఒడిశాకు చెందిన తూర్పు కోస్తా రైల్వే జోన్‌తో ముడిపడి ఉండడం, రైల్వే మంత్రి ఆ రాష్ట్రానికి చెందినవారు కావడమే... అందుకు ప్రధాన కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


రైల్వే జోన్‌కు కేటాయించిన స్థలం (ఫైల్ ఫొటో)

ఆరేళ్ల క్రితం జోన్‌ను ప్రకటించగా, ఆరు నెలల క్రితం జోనల్ కార్యాలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటివరకూ జోన్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రకటించలేదు. జోన్‌లో డివిజన్లు, వాటి సరిహద్దులు అన్నీ సమగ్రంగా గెజిట్‌లోనే ఉంటాయి. జోన్ ఆపరేషన్ తేదీ కూడా అందులోనే ప్రకటిస్తారు. ఆ గెజిట్ లేకపోవడంతో ఏ పనీ ముందుకుసాగడం లేదు. ఒత్తిళ్లు తట్టుకోలేక విశాఖ కేంద్రంగా జోన్ ఇచ్చారు గానీ పూర్తిస్థాయిలో పనిచేసేందుకు తగిన ఆదేశాలు ఇవ్వడం లేదు. జోన్‌కు జనరల్ మేనేజర్‌ను నియమించారు. ఆయన పరిస్థితి 'రాజ్యం లేని రాజు'లా మారింది. పేరుకే ఆయన జోన్ జీఎం. జోన్ పరిధిలోకి వచ్చే డివిజన్లు వాల్తేరు (విశాఖపట్నం), గుంటూరు, గుంతకల్, విజయవాడ డివిజన్లు ఇప్పటికీ వాటి పాత జోన్ పరిధిలోనే నడుస్తున్నాయి. వాల్తేరు తూర్పు కోస్తా రైల్వే పరిధిలో, మిగిలిన మూడు సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోనే ఉన్నాయి. ఆ డివిజన్లకు చెందిన రైల్వే మేనేజర్లు ఆయా జోన్ల జీఎంలు చెప్పిన పనులే చేస్తున్నారు. వారితోనే అన్ని రకాల సంప్రతింపులు జరుపుతున్నారు. కేంద్రం గెజిట్ ఇవ్వకపోవడం వల్ల కొత్త జీఎం వారితో అధికారికంగా కార్యకలాపాలు నిర్వహించలేకపోతున్నారు.

జీఎం కార్యాలయం ఖరారుపై దోబూచులాట

జోన్ జీఎంగా సందీప్ మాథుర్‌ని జూన్ మొదటి వారంలో నియమించారు. ఆయన తక్షణమే ఢిల్లీలోనే బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత విశాఖపట్నం సహా అన్ని డివిజన్లకు వెళ్లి అక్కడి రైల్వే అధికారులతో పరిచయం చేసుకున్నారు. విశాఖలో ఆయనకు ప్రత్యేక కార్యాలయం ఉండాలి. ముడసర్లోవలో కొత్త జోనల్ కార్యాలయం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అవి పూర్తయ్యేసరికి రెండేళ్లు పైనే పడుతుంది. అంతవరకూ వేరే భవనాన్ని అద్దెకు తీసుకోవాలని రెండు, మూడు పరిశీలించారు. వాటికి ఆమోదం రావలసి ఉంది. ఆ విషయంలోనూ రైల్వే పెద్దలు తాత్సారం చేస్తున్నారు. ఏదో ఒకటి ఖరారు చేస్తే జీఎం విశాఖలో కూర్చొని కొన్ని పనులైనా చేసుకునే అవకాశం ఉంది. అది సుతారమూ రైల్వే పెద్దలకు ఇష్టం లేదు. అందుకని ఆ జీఎం భవనాన్ని ఖరారు చేయడం లేదు.

కొర్రీలతో డీపీఆర్ ఆమోదం

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు ... మిగతా 6వ పేజీలో

కోడి వ్యర్థాలు చేపల చెరువుకు తరలిస్తే రూ.50 వేలు జరిమానా

- ప్రజారోగ్య విభాగం అధికారులకు కమిషనర్ ఆదేశం
- కాపులుప్పాడ డంపింగ్ యార్డు వద్ద కోడి వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదన

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కోడి వ్యర్థాల అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయడంపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిసారించారు. ప్రతి రోజూ కార్పొరేటర్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం, ఇరువర్గాలు రౌడీషీటర్లను పెట్టుకుని కొట్లాటలకు దిగుతుండడంపై 'గ్రేటర్‌లో కోడివ్యర్థాల లొల్లి' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రజారోగ్య విభాగం అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కాపులుప్పాడలోని డంపింగ్ యార్డులో కోడి వ్యర్థాలను ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఆసక్తి చూపిన రాజమండ్రి, మంగళగిరికి చెందిన వారిని పిలిపించాలని ఆదేశించారు. అదేవిధంగా చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు తరలింపుపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. పట్టుబడిన వాహనానికి రూ.50 వేలు ... మిగతా 6వ పేజీలో

ఇంజనీరింగ్‌లో బిల్లుల పంచాయితీ!

భీమిలి బీచ్‌లో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా సాయిరెడ్డి కుమార్తె కాంక్రీట్ నిర్మాణం



- హైకోర్టు ఆదేశాల మేరకు తొలగింపునకు చర్యలు తీసుకున్న జీవీఎంసీ
- మౌఖిక ఆదేశాలతో పనులు అప్పగింత
- తాజాగా బిల్లు చెల్లింపు బాధ్యత తమది కాదంటే తమదికాదని వాదులాట
- జీవీఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారుల మధ్య అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరాయనే ప్రచారం జరుగుతోంది. భీమిలి బీచ్‌లో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి చేపట్టిన భారీ కాంక్రీట్ నిర్మాణాల తొలగింపునకు సంబంధించిన పనుల బిల్లుల చెల్లింపుపై తాజాగా మెకానికల్, పబ్లిక్ వర్క్సు ఇంజనీరింగ్ అధికారుల మధ్య పంచాయితీ నడుస్తోంది. చివరికి ఈ వ్యవహారం కలెక్టర్ దృష్టికి వెళ్లింది.

భీమిలి బీచ్‌లో విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి చెందిన అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ కంపెనీ కాంక్రీట్‌తో భారీగా ప్రహరీగోడను నిర్మించింది. సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా తీరంలో భారీ నిర్మాణాలు చేపట్టి పర్యావరణాన్ని దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని తొలగించాల్సిందిగా జీవీఎంసీకి ఆదేశాలు ఇవ్వాలంటూ కొంతమంది హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు కాంక్రీట్ గోడను మార్చి 26లోగా తొలగించాలని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులను ... మిగతా 6వ పేజీలో

ఇకపై జోన్‌ల వారీగా సమావేశాలు

- వార్డుల్లో సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను నేరుగా తెలుసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ నిర్ణయం
- కార్పొరేటర్లు, అధికారులతో భేటీ
- నేడు జోన్-1 పరిధిలో సమావేశం


కేతన్‌గార్గ్

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వార్డుల్లో సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను నేరుగా తెలుసుకునేందుకు ఇకపై జోన్‌ల వారీగా కార్పొరేటర్లు, అధికారులతో భేటీ కావాలని కమిషనర్ కేతన్‌గార్గ్ నిర్ణయించారు. కమిషనర్ కలిసేందుకు తమకు అవకాశం ఇవ్వడం లేదని, సమస్యలపై విజ్ఞాపనలు అందజేసినా పట్టించుకోవడం లేదని కొందరు కార్పొరేటర్లు అసంతృప్తితో ఉన్నారు. కార్పొరేటర్లు బహిరంగంగా తమ అసంతృప్తిని వ్యక్తంచేయడంతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిని అధిగమించేందుకు ఇకపై జోన్‌లవారీగా కార్పొరేటర్లతో భేటీ కావాలని కమిషనర్ నిర్ణయించారు. ఆ సమావేశానికి అన్ని విభాగాల అధిపతులతో పాటు ఆయా జోన్‌ల కమిషనర్లు, ఇతర ముఖ్య అధికారులు కూడా హాజరయ్యేలా చేయడం ద్వారా వార్డుల్లో సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నారు. దీనిపై ఇప్పటికే అధికారులకు కమిషనర్ సమాచారం అందజేశారు. మొదటగా జోన్-1 (భీమిలి)లో ఈనెల 29న సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే నెల రెండున జోన్-2, 6న జోన్-3, 12న జోన్-4, 16న జోన్-5, 20న జోన్ 6, 23న జోన్-7, 26న జోన్-8లో సమావేశం నిర్వహించాలని షెడ్యూల్ తయారుచేసి జోనల్ కమిషనర్లకు పంపించారు. ఆయా కార్పొరేటర్లకు దీనికి సంబంధించిన సమాచారాన్ని ముందుగానే అందజేసే బాధ్యతను జోనల్ కమిషనర్లకు అప్పగించారు. సమావేశానికి సంబంధించిన అజెండాను ఒకరోజు ముందుగానే తయారుచేసి తనకు అందజేయాలని స్పష్టంచేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కంభంపాటి జయశ్రీ

దివ్యాంగులకు బాసటగా నిలవాలి

ఒడిశా గవర్నర్ హరిబాబు సతీమణి జయశ్రీ

సాగర్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) :ప్రతిఒక్కరూ దివ్యాంగులకు అండగా నిలవాలని ఒడిశా గవర్నర్ కంభపాటి హరిబాబు సతీమణి, ఆ రాష్ట్ర ప్రథమ మహిళ కంభంపాటి జయశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం ఆమె గీతం ఆస్పత్రి వైద్యులతో కలిసి బీచ్ రోడ్డులో ఉన్న అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో కంటి చూపు మెరుగుపరచడానికి ఆధునిక టెక్నాలజీ సహాయంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు.కంటి చూపు తక్కువ ఉన్న వారికి కళ్ల జోళ్లు, నాణ్యత గల కాంటాక్ట్ లెన్స్ అందజేస్తామన్నారు. సదరం సర్టిఫికెట్లలో రెండు కళ్లూ లేనివారికి శత శాతం, ఒక కన్ను లేని వారికి 20 శాతం ఇస్తున్నారని దీనివల్ల దివ్యాంగులు సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ జీవోను సరిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గీతం ఆస్పత్రి నేత్ర వైద్యులు నరసింగరావు, రాజీవ్‌గాంధీ, బీజేపీ నాయకుడు రూపాకుల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

శొంఠ్యాం వీఆర్‌ఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆనందపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ వీఆర్‌ఓపై అదే గ్రామానికి చెందిన బొత్స రాము సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామంలో సర్వే నెంబరు 123లో ఉన్న కొండ పోరంబోకు స్థలంలో ఆరు సెంట్లను లెంక నూకరాజు ఆక్రమించి, భవనం నిర్మించారు. దీనికి వీఆర్‌ఓ పిల్లా ప్రియనాథ్ పూర్తి సహకారాలు అందించారు. ఆక్రమిత స్థలం విలువ సుమారు రూ. 20 లక్షల ఉంటుంది. ఈ విషయమై దర్యాప్తు జరిపి వీఆర్‌వోపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. అలాగే బీపీవికల్లాలు పంచాయతీకి చెందిన రేషన్ డీలర్‌పై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. డీలర్ బంటుబిల్లి సత్య సుమంగళి 30 ఏళ్లుగా స్థానికంగా నివాసం ఉండడం లేదని ఆమె ఎప్పుడు డిపో తెరుస్తారో తెలియడం లేదని చెప్పారు. సమయానికి సరకులు ఇవ్వడడం లేదని ఆరోపించారు. దర్యాప్తు జరిపి డీలర్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



క్లబ్ నూతన అధ్యక్షుడ్ని అభినందిస్తున్న సభ్యులు

తగరపువలస, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక హైవే ఫంక్షన్ హాలులో లయన్స్ క్లబ్ భీమిలి సెంచురీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం రాత్రి జరిగింది. అధ్యక్షుడిగా టి.వి.నాయుడు, కార్యదర్శిగా జి. శ్రీనివాసరావు కోశాధికారిగా కె. శ్రీరామచంద్రమూర్తి, సభ్యులుగా థామస్, బి. కిరణ్, కె. శ్రీరామ్, మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడు నాయుడు భీమిలి జీవీఎంసీ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో పద్మరాణి, రామునాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్మార్టు మీటర్లు ఏర్పాటు చేయొద్దు : సీపీఐ

తగరపువలస, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్టు మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు జీఆర్ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి కె. రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పనులు చేస్తే ఉద్యమిస్తామన్నారు. భవిష్యత్తులో ప్రతిపక్ష పార్టీలతో కలిసి స్మార్టు మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ పోరాటం చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలపై బాదుడే బాదుడు అన్న నినాదంతో అప్పటి వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేసి, అధికారంలోకి రాగానే అదే విధానాన్ని అమలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు ఎం. అప్పలరాజు, సన్నిబాబు, ఈశ్వరరావు, గోవిందరావు, ముత్యాలరావు, వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్వహణపై ఫిర్యాదు

భీమునిపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ సమీపంలో నిర్వహిస్తున్న చర్చి వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం సభ్యులు తెలిపారు. సోమవారం వారు ఈ విషయమై తహసీల్దార్ పైల రామారావు, జడ్సీ అయ్యప్పనాయుడుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీచ్ రోడ్‌లో పోలమాంబ అమ్మవారి ఆలయానికి సమీపంలో నిర్వహిస్తున్న చర్చి వల్ల తమ మనోభావాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. పెద్ద పెద్ద సౌండ్ బాక్స్‌లతో ప్రార్థనలు చేస్తుండడం వల్ల భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అల్లిపిల్లి నరస్సింగరావు, వాసుపల్లి జానకీరావు, వాసుపల్లి గరగయ్య, బర్రి కొండబాబు, వాసుపల్లి అనిల్‌కుమార్, అల్లిపిల్లి అప్పారావు, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోడి వ్యర్థాలు చేపల చెరువుకు తరలిస్తే రూ.50 వేలు జరిమానా

... 5వ పేజీ తరువాయి

జరిమానా విధించాలని ఆదేశించినట్టు తెలిసింది. ఇప్పటివరకూ 15 వాహనాలను పట్టుకుని సీజ్ చేసినందున వాటి నుంచి ఆ మేరకు జరిమానా వసూలుచేయడంపై అధికారులు దృష్టిసారించారు. కోడి వ్యర్థాల మాఫియా వెనుక ఉన్నవారెవరో గుర్తించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు చేపల చెరువులకు తరలిపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ శ్రీనివాసరావు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో కమిషనర్‌కు ఫిర్యాదు అందజేశారు.

ఆక్రమణలో కొండవాలు ప్రాంతాలు

- ఎండాడలో రెచ్చిపోతున్న కబ్జారాయుళ్లు
- ఎక్కడ చిన్న జాగా కనిపించినా షెడ్ల నిర్మాణం
- ఫిర్యాదులు వెళుతున్నా.. పట్టని అధికారులు

ఎండాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతాలు ఆక్రమణకు గురవుతున్నాయి. రాత్రికి రాత్రి యంత్రాలతో స్థలాలను చదును చేసి, ప్లాట్లుగా చేసి వాటికి పట్టాలు సృష్టించడంతో పాటు పన్నులు వేసినట్టు రశీదులు సృష్టిస్తున్నారు. ఈ తతంగం వెనుక స్థానిక నాయకులు ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతం విలువైనదిగా మారడంతో ఇక్కడ గజం స్థలం రూ. 80 వేలు నుంచి లక్ష రూపాయల వరకు ఉంది. దీంతో కబ్జారాయుళ్లు రెచ్చిపోతున్నారు. ఎక్కడ చిన్న జాగా కనిపించినా షెడ్ నిర్మించి, ఆక్రమణకు పాల్పడుతున్నారు. కొందరు చోటామోటా నాయకులు గ్రూపుగా ఏర్పడి అమ్మకాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎండాడలో సర్వే నెంబరు ఒకటి, 92, 95లో ఉన్న కొండవాలు ప్రాంతాలను చదును చేయడం 60, 85 గజాలుగా వేసి పాకలు వేయడం, కొద్ది రోజులకు షెడ్ల నిర్మించడంతో పాటు కరెంట్ మీటర్లు పెట్టి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. అంతా పక్కా ప్రణాళిక ప్రకారం జరుగుతోంది. ఇందులో అధికారుల పాత్ర కూడా ఉందన్న విమర్శలు ఉన్నాయి. ఫిర్యాదులు వెళ్లాక రెవెన్యూ సిబ్బంది స్పందించి హెచ్చరిక బోర్డులు పెడుతున్నా.. రాత్రికి రాత్రి వాటిని తొలగిస్తున్నారు. హయగ్రీవ కొండ కింద ఉన్న రాజీవ్ నగర్ కొండవాలు ప్రాంతాన్ని జీవీఎంసీ పరిధిలోకి తెచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన స్థలం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయగా దాన్ని కూడా తొలగించారు.గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఎండాడలో యూపీహెచ్‌సీ నిర్మాణం చేపట్టడంతో ఆసుపత్రి ఈ ప్రాంతంలో రాదని తెలిసి హెచ్చరిక బోర్డును తీసేశారు. చాలా చోట్ల కొండవాలు ప్రాంతాల్లో నిర్మాణాలు జరుగుతున్నా.. రెవెన్యూ, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు మరింతగా రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సర్వే నెంబర్ ఒకటిలో చదును చేస్తున్న స్థలం



ఎండాడలో హయగ్రీవ కొండ కింద చదును చేస్తున్న స్థలం

అర్హులందరికీ ఇళ్లు : ఎమ్మెల్యే గంటా

తునివలసలో 'సుపరిపాలనకు తొలి అడుగు'

పద్మనాభం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులందరికీ ఇళ్ల మంజూరు చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సోమవారం ఆయన తునివలస గ్రామంలో జరిగిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద ఇంటికి ఒకరు చొప్పున 42 లక్షల మందికి లబ్ధి చేకూర్చగా కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అందరికీ తల్లికి వందనం పథకం అమలు చేసిందని చెప్పారు. పథకాన్ని 67 లక్షల మందికి అందించినట్టు తెలిపారు. మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు సామాజిక పింఛన్లు రూ.2 వేలు చొప్పున ఇస్తుండగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ. 4 వేల చొప్పున ఇస్తున్నారన్నారు. వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం కల్పించనున్నట్టు చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఏడు ఎకరాలు సేకరించామని, రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రూ.15 లక్షలతో ప్రతిపాదించిన సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే వృద్ధులకు 5 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ కాకర ఆనందరావు, భీమిలి ఏఎంసీ డైరెక్టర్ వాళ్ల నందిని, మాజీ సర్పంచులు జి. మహేశ్వరరావు, ఆర్‌పీఎన్ మూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ రమణ, మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్‌కుమార్, నాయకులు దామోదరరావు, కేవీ సత్యనారాయణ, అవాల గంగరాజు, పావని, కురిమిన లీలావతి, గాడు వెంకటప్పుడు, బీఆర్‌బీ నాయుడు, రామరాజు, మొకర అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పీజీఆర్ఎస్‌కు ఏడు వినతులు

భీమునిపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఏడు వినతులు అందాయి. జడ్సీ అయ్యప్పనాయుడు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. యూసీడీ విభాగానికి 1, పట్టణ ప్రణాళికా విభాగానికి, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ విభాగాలకు రెండేసి చొప్పున అర్జీలు వచ్చాయి.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

రోడ్డుపై మురుగు నీటితో అవస్థలు

భీమునిపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దాస ఆంజనేయస్వామి ఆలయం ముందు ఉన్న డ్రైనేజీ పూడికలతో నిండిపోవడంతో మురుగు నీరు బయటకు వస్తోంది. దీంతో భక్తులు, చుట్టు పక్కల నివాసితులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు పది రోజులుగా ఈ పరిస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. సుభాశ్ రోడ్‌లో వున్న ఈ ఆలయం మీదుగా పెట్రోల్ బంక్, మెయిన్ రోడ్, కేంబ్రిడ్జి స్కూల్ మీదుగా డచ్ కాలం నాటి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉంది. ఈ డ్రైనేజీ ద్వారా ఆ ప్రాంతంలోని మురుగునీరు ఉప్పుటేరులో కలుస్తుంది.ఎనిమిది అడుగుల లోతున ఉండే ఈ కాలువ ఏ కారణంతోనే బ్లాక్ అయ్యింది. రెండు వారాలుగా డ్రైనేజీలోని మురుగు నీరు బయటకు వస్తున్న విషయాన్ని ఆలయ అర్చకుడు వంశీ మోహన చెన్న కృష్ణమాచార్యులు జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి కాలువ మ్యాన్‌హోల్ ఎక్కడ వుందో తెలుసుకోవడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. తర్వాత జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి యూజీడీ సిబ్బందిని రప్పించారు. వారు కూడా పరిశీలించి ఆలయం సమీపంలో సుమారు నాలుగైదు అడుగుల లోతులో పెద్ద గొయ్యి తవ్వి మ్యాన్ హోల్ గుర్తించడానికి ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. ప్రస్తుతం ఈకాలువలోని మురుగు నీరు యూనియన్ బ్యాంక్, అనిల్ కాంప్లెక్స్ జంక్షన్, మెయిన్ రోడ్ మీదుగా పొంగిపొర్లుతూ జోనల్ కార్యాలయంవైపుగా వెళుతుంది. దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తి వల్ల పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



ఆలయం ముందు మురుగు నీరు

విశాఖలో ఫిర్యాదుల పరిష్కారం భేష్

... 5వ పేజీ తరువాయి

పలువురు ఫిర్యాదు చేశారు. పెదజాలరిపేటలో గ్రామ కంఠంగా గుర్తించిన స్థలాలను ప్రజావసరాలకు అనుమతించాలని మత్స్యకార సంఘ నాయకులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

అనంతరం మంత్రి అనగాని మాట్లాడుతూ విశాఖ, తిరుపతిల్లో పీజీఆర్ఎస్ బాగా జరుగుతుందని, సమస్యల పరిష్కారంలో సానుకూలత ఉందన్నారు. ఇక్కడ అవలంబిస్తున్న విధానాలను చూసి మిగిలినచోట్ల అమలు చేసేందుకుగాను కార్యక్రమంలో భాగస్వామిని అయ్యానన్నారు. ప్రభుత్వ పథకాలు విశాఖలో బాగా అమలు జరుగుతున్నాయని ప్రశంసించారు. విశాఖ వాసులకు సానుకూల దృక్పథం ఎక్కువని, ఇక్కడ శాంతియుత వాతావరణం ఉండడంతో పెట్టుబడులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన నగరంగా విశాఖపట్నం నిలుస్తోందన్నారు. అందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖకు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారని, ఇదే విషయం తరచూ సమీక్షలలో గుర్తుచేస్తుంటారన్నారు. ఐటీ రంగానికి ఊతమిస్తూ విశాఖ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని, ఫలితంగా చాలా కంపెనీలు వస్తున్నాయన్నారు. కాగా జిల్లాలో పీజీఆర్ఎస్ నిర్వహణ గురించి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వివరించారు. ప్రతి వారం వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత కాలంలో ఎండార్స్‌మెంట్ ఇస్తూ పరిష్కరిస్తున్నామన్నారు. ఇంకా క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహిస్తున్నామని, నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపుతున్నామన్నారు. పీజీఆర్ఎస్‌లో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు 427 ఫిర్యాదులు రాగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 180, తల్లికి వందనం పథకం అందలేదని సుమారు 80, జీవీఎంసీ సమస్యలపై 54 వచ్చాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

సింహగిరిపై అస్తవ్యస్తంగా డ్రైనేజీలు

సింహాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం ముందు నుంచి సింహగిరి బస్టాండ్ వరకు, అలాగే కారు పార్కింగ్ సమీపంలో, లోవతోట వద్ద కాలువలు శిథిలం కావడంతో పాటు అనేకచోట్ల పలకలు విరిగిపోయాయి, కొన్నిచోట్ల ప్రత్యామ్నాయంగా ఉంచిన ఐరన్ మెష్‌లు పాడయ్యాయి. దీంతో భక్తులు రాకపోకలకు ఇబ్బందులు పడడమే కాకుండా కొన్నిసార్లు ప్రమాదాలకు గురవుతున్నారు.ఇంజినీరింగ్ అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





పూడికలు, విరిగిన పలకలతో ఉన్న కాలువలు

ఇంజనీరింగ్‌లో బిల్లుల పంచాయితీ!

... 5వ పేజీ తరువాయి

ఆదేశించింది. దీంతో భీమిలి (జోన్-1) టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఆధ్వర్యంలో బీచ్‌లోని నిర్మాణాలను పరిశీలించారు. సుమారు ఆరు అడుగుల లోతున ఫుట్టింగ్‌లు వేసి 588 మీటర్ల మేర సిమెంట్ కాంక్రీట్ గోడ నిర్మించారని, దానిని తొలగించేందుకు అవసరమైన జేసీబీలను ఏర్పాటుచేయాలని కోరుతూ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ప్రతిపాదన పంపించారు. ఆ నిర్మాణాలను తొలగించాలంటే 200 కెపాసిటీ కలిగిన బ్రేకర్ జేసీబీ యంత్రాలు ఉండాలని, అవి జీవీఎంసీ వద్ద లేనందున ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకోవాల్సి ఉంటుందని, ఇందుకోసం సుమారు రూ.70 లక్షలు ఖర్చవుతుందని పేర్కొంటూ అంచనాలను అప్పటి జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన జిల్లా కలెక్టర్‌కు పంపించారు. తర్వాత మెకానికల్ విభాగం అధికారులు ఐదు ప్రైవేటు ఏజెన్సీల నుంచి ఐదు 200 బ్రేకర్ జేసీబీలతో బీచ్‌లో నిర్మించిన కాంక్రీట్‌గోడను పునాదులతో సహా తొలగించే పనులను మార్చి ఎనిమిదిన ప్రారంభించి, 17 రోజులపాటు కొనసాగించారు. అప్పటికి 321 మీటర్ల గోడను తొలగించి, డెబ్రిస్‌ను కాపులుప్పాడలోని యార్డుకు తరలించారు. అంతవరకూ అయిన బిల్లు చెల్లిస్తేనేగానీ మిగిలిన పనులను పూర్తిచేయలేమని కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. తాను యంత్రాలను ఎంగేజ్ చేయలేదు కాబట్టి, బిల్లు పెట్టలేనంటూ భీమిలి జోన్ ఈఈ అభ్యంతరం వ్యక్తంచేశారు. దాంతో కాంట్రాక్టర్లు మెకానికల్ విభాగం అధికారులను సంప్రదిస్తే పనుల అంచనాలను పబ్లిక్ వర్క్స్ ఈఈ...కలెక్టర్‌కు పంపించినందున అక్కడి నుంచే బిల్లు ప్రిపేర్ చేయాలని సమాధానం ఇచ్చారు. ఈలోగా మెకానికల్ ఈఈగా పనిచేసిన చిరంజీవి ఉద్యోగ విరమణ చేయగా, భీమిలి జోన్ ఈఈగా పనిచేసిన దిలీప్‌కుమార్‌కు జోన్-8కు బదిలీ అయిపోయింది. అనంతరం వచ్చిన అధికారులు బిల్లు పంచాయితీని ఒకరిపై ఒకరు నెట్టుకోవడం ప్రారంభించారు.

కమిషనర్‌కు ఫిర్యాదు

దీంతో కాంట్రాక్టర్లంతా గత నెల 30న జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి బిల్లు చెల్లింపులో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, వారి మధ్య సమన్వయలోపంపై ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ (ఫైనాన్స్)ను కమిషనర్‌ను ఆదేశించారు. అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో తాజాగా ఈనెల 21న జిల్లా కలెక్టర్‌ను కలిసి ఇంజనీరింగ్ అధికారుల తీరుపై ఫిర్యాదు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు తక్షణం పనులు ప్రారంభించాలని, తర్వాత వర్క్ ఆర్డర్‌ను ఇచ్చి ర్యాటిఫై చేయిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు తమను బలిచేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ పల్లంరాజును వివరణ కోరగా భీమిలి బీచ్‌లో నిర్మాణాల తొలగింపునకు సంబంధించిన బిల్లు చెల్లింపు విషయంలో మెకానికల్, పబ్లిక్ వర్క్స్ ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లోపించిందని అంగీకరించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని, బిల్లు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని మెకానికల్, పబ్లిక్స్‌వర్క్స్ అధికారులను ఆదేశించానన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రైల్వే జోన్‌కు రెడ్ సిగ్నల్స్!

... 5వ పేజీ తరువాయి

సంబంధించిన డీపీఆర్‌ను ఈ ఏడాది జనవరి నెలాఖరులో ఢిల్లీకి పంపితే ఆరు నెలలు దానిని మురగబెట్టి వారం క్రితం కొర్రీలతో ఆమోదించారు. రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఇచ్చేశారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ విశాఖపట్నం జోన్ నుంచి రాయగడలోకి వెళ్లిపోయింది. పార్వతీపురం సమీపానున్న కూనేరు కూడా రాయగడ డివిజన్‌కే ఇచ్చేశారు. కొత్తవలస నుంచి పలాస వరకు విశాఖపట్నం డివిజన్‌లో ఉంచారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టేషన్లన్నీ తూర్పు కోస్తా జోన్‌లోని ఖుర్దా డివిజన్‌లో ఉండిపోయాయి.

ఆర్ఆర్‌బీపై చర్చ శూన్యం

రైల్వేలో ఉద్యోగ అవకాశం రావాలంటే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) నిర్వహించే పరీక్షలు రాయాలి. వాటికి హాజరయ్యేందుకు ఒడిశాలోని భువనేశ్వర్‌కు వెళితే...'ఆంధ్రావాళ్లు' అని వెనక్కి పంపించేసేవారు. ఆ నేపథ్యంలోనే విశాఖ కేంద్రంగా జోన్ ఏర్పాటుచేస్తే ఇక్కడే ఆర్ఆర్‌బీ కేంద్రం వస్తుందని యువత భావించింది. ఇప్పుడు జోన్ ప్రకటించినా ఇంకా ఆర్ఆర్‌బీ కేంద్రం ఇవ్వలేదు. దీనిపై ఎవరూ మాట్లాడడం లేదు. రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ వ్యవహరిస్తున్నారు. ఆయన జోన్ కార్యకలాపాల వేగవంతంపైన, ఆర్ఆర్‌బీ వంటి అంశాలపైనా దృష్టి సారించాలి. ఆయన ప్రయత్నిస్తే అన్నింటికీ వెనువెంటనే ఆదేశాలు వస్తాయి.

కూటమిలో కొలిక్కిరాని కసరత్తు

... 5వ పేజీ తరువాయి

మేయర్ కోరారు. కాగా, ప్రస్తుతం కూటమి అభ్యర్థులుగా భీమిలి నుంచి ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, తూర్పు నియోజకవర్గం నుంచి 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, దక్షిణ నియోజకవర్గం నుంచి 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్, గాజువాక నుంచి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గం నుంచి దాడి వెంకటరామేశ్వరరావు పేర్లు దాదాపు ఖరారైనట్టు తెలిసింది. పెందుర్తి నుంచి శానాపతి వసంత, రాపర్తి కన్నా మధ్య, ఉత్తర నియోజకవర్గం నుంచి ముక్కా శ్రావణి, గంకల కవిత మధ్య పోటీ నెలకొంది. అనకాపల్లి నుంచి ఎవరికి అవకాశం ఇవ్వాలనేదానిపై నేతలు ఇంకా స్పష్టతకు రాలేదు. జనసేనకు మరొకటి ఇవ్వాల్సి వస్తే ఆ పార్టీ నేతలు ఎవరికి అవకాశం ఇస్తారో చూడాల్సి ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలు వరకు మాత్రమే నామినేషన్ల దాఖలుకు గడువు ఉండడంతో ఉదయాన్నే అభ్యర్థులను ప్రకటించి, వెంటనే నామినేషన్లు దాఖలు చేయిస్తామని కూటమి నేతలు చెబుతున్నారు.

కళానగర్‌లో సమస్యలపై వినతి

మధురవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని కళానగర్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ జడ్సీ కనకమహాలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఘనంగా గోదాదేవి జయంత్యుత్సవం

ఎంవీపీ కాలనీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరు వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. గోదా జయంతి సందర్భంగా ఉదయం తిరువారాధన, విష్వక్సేన ఆరాధన, నవకలశం, హోమం, 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారి విగ్రహదాత దంపతులు డాక్టర్ వెంపటి రామ నరసింహం,దుర్గారాణి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు లక్ష్మణస్వామి, శ్రీనివాస్, కమిటీ కార్యదర్శి ప్రసాదరావు, సభ్యులు జయరాం, గౌరి, జగన్, మూర్తి తదితరుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యానికి ధీమా ఇవ్వని బీమా

ఆరిలోవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న ప్రతి 20 మంది వృద్ధుల్లో ముగ్గురికి మాత్రమే ఆరోగ్య బీమా ఉందని ఎల్‌వీ ప్రసాద్ నేత్రవైద్యశాల వైద్యుడు డాక్టర్ బ్రిజేష్ టక్కర్ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన సర్వేల ద్వారా ఈ విషయం వెల్లడైందన్నారు. ఇప్పటి బీమా విధానాలు నిష్ప్రయోజనమని వృద్ధులు భావిస్తున్నారని తెలిపారు. ఆయుష్మాన్‌భవ వంటి ప్రభుత్వ ఆరోగ్య పథకం ద్వారా బీమా విలువ కొంత పెరిగిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆరోగ్య సమానత్వం సాధించడంలో ఇవి కీలకమని ఈ అధ్యయన రచయితల్లో ఒకరైన డాక్టర్ రాజీవ్‌నారాయణ పేర్కొన్నారు. తగినంత బీమా కవరేజ్ ఉంటే సకాలంలో ఆరోగ్య సంరక్షణ పొందే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేయించరూ



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

ఆరిలోవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి):జీవీఎంసీ పరిధికి చెందిన పైనాపిల్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా గల ప్రభుత్వ బావి శిథిల స్థితికి చేరింది. ఈ బావి చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ స్థలం విలువ సుమారు రూ. కోటి వరకు ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఆక్రమణకు గురవుతున్నా వాటర్ వర్క్స్ వారు లేదా సచివాలయ సిబ్బంది పట్టించుకోలేదని పలువురు నుంచి విమర్శలు వస్తున్నాయి. బావి స్థలం చుట్టూ సెంటరింగ్ కర్రలు వేసి ఉంచారు. వీటి నిల్వతో దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సినిమా గైడ్

● **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

● **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 45, వంకాయలు(తెలుపు) 38,వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 34, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 26, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 22, క్యారెట్ 44, దొండకాయలు 28, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 66, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50,బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 76, కీరదోస 30, కాప్సికమ్ 766, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 40, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

ఎవరి పని వారిదే!

» ఉన్నతాధికారులు ఆగ్రహిస్తారు
» స్థానిక అధికారులు పాటించరు
» యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
» జీవీఎంసీ ఆదాయానికి గండి
» 16వ వార్డులోని రజక వీధిలో పరిస్థితి

వెంకోజీపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై జీవీఎంసీ ఉన్నతాధికారులు ఆగ్రహిస్తూనే ఉంటారు.. ఆక్రమణలు తొలగించి, అనుమతులు లేని కట్టడాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిస్తారు. కానీ కింది స్థాయిలో (వార్డు సచివాలయం అధికారులు) 'తమ పని' తాము చేసుకుంటూ వెళ్లిపోతున్నారు. ఇచ్చిన అనుమతులను అతిక్రమించి బహుళ అంతస్థులు, ఆక్రమణ కట్టడాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఆక్రమణలకు తావివ్వకుండా చూడాలని, జీవీఎంసీ ఆదాయ వనరులు పెంచాలని పదే పదే మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ సమీక్ష సమావేశాల్లో అధికారులకు నిర్దేశిస్తున్నా కిందిస్థాయి సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. వారొచ్చి పరిశీలిస్తే కదా.. అన్న ధైర్యం వీరిలో ఉంది. జోన్-3 పరిధిలోని 16వ వార్డుకు చెందిన హెచ్‌బీకాలనీ రజక వీధిలో స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ స్థలాల్లో అనుమతి లేకుండా పక్కపక్కనే అదనపు అంతస్థు నిర్మించారు. ఈ బిల్డింగ్‌ల నిర్మాణంలో కొందరు అధికారులు చేతివాటం చూపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్డింగ్ అసెస్‌మెంట్ నెంబరు 1086/0580/బి/23/ఎంఈఎం/2025 ప్రకారం ఈ రెండు బిల్డింగ్‌లకు జీవీఎంసీ స్టిల్ట్, గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ , టెరస్‌ఫ్లోర్(వాటర్ ట్యాంకు) ల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. కానీ వీరు కోట్లాది రూపాయలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేసుకుని నియమాలు పాటించకుండా అనుమతులకు తగ్గినట్టుగా నిర్మించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. తాము చిన్న గది నిర్మించుకుంటేనే వెంటనే తమపై దాడి చేసి అపరాధ రుసుము వసూలు చేసే టౌన్‌ప్లానింగ్ అధికారులకు అనుమతులు లేకుండా బహుళ అంతస్తు నిర్మాణం, ప్రమాద నివారణ చర్యలు పాటించకుండా నిర్మాణం చేపడుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడమేమిటని స్థానికులు నిలదీస్తున్నారు. ఈ బిల్డింగ్ వ్యవహారంపై స్థానికంగా జోనల్ కార్యాలయానికి పలు ఫిర్యాదులు వచ్చినా ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.



రజకవీధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం



హెచ్‌బీ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ మార్గంలో అక్రమంగా నిర్మిస్తున్న భవనం

అనుమతులు ఉన్నంత వరకు ఓపెన్‌గా నిర్మించి, అక్రమ అంతస్థులు మాత్రం చుట్టూ పరదాలు కట్టి చాటుమాటుగా చేపడుతూ జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా నిర్మించే అక్రమ అంతస్థులను కేవలం నల్లధనం కలిగిన వారు మాత్రమే కొనుగోలుకు సిద్ధపడతారని, దాని వల్ల ఆదాయపు పన్నుకు కూడా గండి కొడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటిపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో ఆదరణ

ఎమ్మెల్యే వెలగపూడి, మేయర్ పీలా



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

రామ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ పాలనలో చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల్లో మంచి ఆదరణ కనిపిస్తోందని మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని 28వ వార్డు రామ్‌నగర్‌లో వారిద్దరూ పర్యటించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తాగునీటి కొళాయిలలోనూ, ఇళ్లలోని చేతిపంపుల్లో మురుగు నీరు చేరి కలుషితమవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ వార్డు అధ్యక్షుడు నక్కా కనకరాజు తెలియజేయటంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. వీటిని తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, టీడీపీ వార్డు అధ్యక్షుడు నక్కా కనకరాజు, నక్కా అన్నపూర్ణ, ఉరుకూటి పైడిరాజు, డిల్లీశ్వరి, శ్యామల, వైసీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా రోడ్ల నిర్మాణం పూర్తి

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్

సిరిపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : భోగాపురం ఎయిర్‌పోర్టుకు అనుసంధానించే రహదారుల నిర్మాణం గడువులోగా పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వారు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో రహదారుల నిర్మాణంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఇప్పటికే కొన్ని పనులు చేపట్టగా మిగిలిన రహదారుల పనులను త్వరలోనే ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో బాధితులు మాస్టర్‌ప్లాన్‌పై ఇచ్చిన సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం మెట్రో రైల్ ప్రాజెక్టు వివరాలను వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా ప్రజాదర్బార్‌కు పది వినతులు రాగా వాటిలో ప్లానింగ్ విభాగానికి 6, పరిపాలనకు 2, ఇంజనీరింగ్‌కు 2 వినతులు వచ్చాయి. సమావేశంలో జాయింట్ కమిషనర్ కే. రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, సీపీఓ శిల్ప, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఇంజనీర్లు భవానీ శంకర్, బలరామరాజు , తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా హైస్కూల్ ఆవరణ



ఖాళీ మద్యం బాటిళ్లు

ఆరిలోవ, జూలై 28 ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాల గేటు సమీపంలో ప్రతిరోజూ రాత్రివేళ మందుబాబులు మద్యం తాగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు.ఈమేరకు అక్కడ ఖాళీ మద్యం సీసాలు కూడా కనిపిస్తున్నాయి. వీధి లైట్లు ఏర్పాటు చేయకపోవడం, పాఠశాలకు వాచ్‌మన్ లేకపోవడంతో రాత్రివేళ మందుబాబులు ఇక్కడికి చేరి, చిందులు వేస్తున్నారు.

అర్చకుడి అదృశ్యం కేసు దర్యాప్తునకు మరో బృందం

భీమిలి సీఐ తిరుమలరావు

భీమునిపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చోడేశ్వరాలయం అర్చకుడు ఏడిద గణేష్ సుబ్రహ్మణ్యశర్మ కేసు దర్యాప్తును మరొకరికి అప్పగిస్తామని సీఐ తిరుమలరావు సోమవారం తెలిపారు. శర్మ ఏప్రిల్ 24న ఇక్కడి నుంచి బయలుదేరి తిరుపతి వెళ్లారు. 26న స్వామి దర్శనం అయినట్టు భార్య మాధురికి ఫోన్‌లో తెలిపారు. తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ అయిపోయింది. అప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియలేదు. భీమిలి పోలీసులు జూన్ 13న మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తునకు హెచ్‌సీ ప్రసాద్‌ను నియమించారు. ఆయన ఆధ్వర్యంలో ఇరువురు కానిస్టేబుళ్లతో పాటు కుటుంబసభ్యులు తిరుపతి వెళ్లారు. అదృశ్యమైన అర్చకుడి స్మార్ట్ ఫోన్‌ను కనుగొన్నారు. బస్ చార్జీల కోసం రూ.700కు స్మార్ట్ ఫోన్‌ను అమ్మివేయగా, ఆ సెల్ నలుగురు చేతులు మారింది.

ఆ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని తీసుకురావడం జరిగింది. కాగా, తర్వాత ఎస్ఐ హరీష్‌ను దర్యాప్తు అధికారిగా ఈనెల ప్రారంభంలో నియమించారు. అయితే, ఆయన్ను సిటీ టాస్క్ ఫోర్స్‌కు అధికారులు అటాచ్ చేసినందున...ఈ కేసు గురించి నార్త్ ఏసీపీ దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా మరో ఎస్ఐను నియమించి, రెండు టీమ్‌లను తిరుపతి పంపించాలని కోరనున్నట్టు సీఐ చెప్పారు. కాగా, సుబ్రహ్మణ్యశర్మ భార్య మాధురి, ఆమె కుటుంబీకులు తిరుపతి, కాశీ, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాలలో గాలిస్తున్నారని, ఇంకా జాడ తెలియలేదని సీఐ తెలిపారు. ఒక పక్క కుటుంబసభ్యులు, మరోపక్క డిపార్టుమెంట్ పరంగా తాము కూడా ప్రయత్నించి ఈ కేసు మిస్టరీని త్వరలో ఛేదిస్తామన్నారు.

నీలగిరి తోటల సాగుపై రైతుల ఆసక్తి



అర్చకునిపాలెంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నీలగిరి మొక్కలు

పద్మనాభం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు నీలగిరి మొక్కల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పొలాల్లోను, ఖాళీ స్థలాల్లో ఈ మొక్కలు వేస్తున్నారు. ఉపాధి హామీ పథకం-సామాజిక అటవీ పథకం ద్వారా మొక్కలను సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ నర్సరీల్లో నీలగిరి, సరుగుడుతో పాటు జామ, ఉసిరి, కానుగ మొక్కలను పంపిణీ చేస్తున్నారు. వీటిలో ఇప్పటికే జామ, ఉసిరి, కానుగ మొక్కలను ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేశారు. పద్మనాభం, అర్చకునిపాలెం, శేరిఖండం గ్రామాల్లోని నర్సరీల్లో నీలగిరి, సరుగుడు తదితర 1.80 లక్షల మొక్కల వరకు అందుబాటులో ఉన్నాయి.అవసరమైన రైతులు ముందుకు వస్తే ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కాగా రైతులు నీలగిరి మొక్కల్లో కోన్ నీలగిరి మొక్కలపై మక్కువ చూపిస్తున్నారు. ఇవి తొందరగా పెరుగుదల రావడంతో పాటు చెట్లు కొట్టిన తరువాత కూడా కార్సితోట మొక్కల పెరుగుదల బాగుంటుంది. తక్కువ కాలంలో ఫలసాయం అందడంతో రైతులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. టిష్యూ కల్చర్ ద్వారా తయారు చేసిన కోన్ మొక్కలకు ఎక్కువగా డిమాండ్ ఉంది. ఒక్కో మొక్క రూ. 5 వరకు ప్రైవేటు నర్సరీల్లో విక్రయిస్తున్నారు. దీంతో అర్చకునిపాలెంలో ఎక్కువ మంది ఈ మొక్కల విక్రయం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఇవి ప్రధానంగా భద్రాచలంలో మాత్రమే లభ్యమవుతాయి.అక్కడి నుంచి వ్యాపారులు ఇక్కడికి తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు.

భావనారాయణస్వామికి వెండి మకరతోరణం



ఈవో సూర్యనారాయణకు వెండి మకరతోరణం అందజేస్తున్న దాత

సర్పవరం జంక్షన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామికి విశాఖ ఎస్ఆర్ పురానికి చెందిన వెంకటాచార్య వైదిక సంస్థానం నిర్వాహకుడు సాతులూరి గోపాలకృష్ణమా చార్యులు రూ.12 లక్షలు విలువ చేసే పది కిలోల వెండి మకరతోరణం చేయించారు. సోమవారం దీన్ని ఈవో తలాటం వెంకట సూర్యనారాయణ సమక్షంలో శ్రీమూల భావనారాయణస్వామికి అందజేశారు.

ప్రమాదకరంగా వాంబే కాలనీ గృహాలు

» శిథిలమైన శ్లాబ్, పెచ్చులూడుతున్న పోర్టుకో
» వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటూ జీవనం



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న పోర్టుకో

మధురవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మధురవాడ వాంబేకాలనీ ప్రజలు నిత్యం భయాందోళన మధ్య బతుకుతున్నారు. పాతికేళ్ల కిందట నిర్మించిన గృహాలు కనీస నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ కాలనీలో 120 బ్లాకుల్లో 3600 గృహాలను జీ ప్లస్ 3 తరహాలో ప్రభుత్వం నిర్మించింది. అప్పట్లో నగరంలోని పలు మురికివాడల్లో నివసిస్తున్న వారిని ఇక్కడికి తరలించి వసతి కల్పించారు. ప్రస్తుతం 120 బ్లాకుల్లో నిర్మించిన ఇళ్లు మరమ్మతుకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల శ్లాబ్ పెచ్చులూడి ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి. మెట్లు పూర్తిగా పాడయ్యాయి. బాల్కనీలు కూడా పెచ్చులూడి పడుతున్నాయి. గోడలు రంగులు వెలసి వెలవెలపోతున్నాయి. రెండేళ్ల కిందట ఒక బ్లాకులోని మెట్ల మార్గం కూలిపోయి ఇద్దరు గాయపడ్డారు. ప్రతిరోజూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్లాబ్ బాగాలేకపోవడంతో సీలింగ్ ఫ్యాన్లు కిందపడిపోతున్నాయి. మెట్ల మార్గంలో మూడో ఫ్లోర్‌కు చేరాలంటే గుండెలు అరచేతిలో పెట్టుకుంటున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో మరింత భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు.

కాలనీ ఇళ్లకు మరమ్మతులు చేయించాలని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గంటా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా భూలోకమాత అమ్మవారి తొలేళ్లు

నేటి ఉత్సవానికి ప్రముఖులకు ఆహ్వానం





ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కమిటీ సభ్యుల ఆహ్వానం (ఇన్‌సెట్లో) భూలోకమాత

వెంకోజీపాలెం, జూలై 28(ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత అమ్మవారి తొలేళ్లు సోమవారం ఘనంగా జరిగాయి.తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో మహిళ లు ఆలయాన్ని శుభ్రం చేసి, ముగ్గులతో మంగళవారం నిర్వహించే వార్షిక మహోత్సవంలో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో జిగేల్‌మనిపించారు. కమిటీ అధ్యక్షుడు ఆదారి సత్తిబాబు ఆధ్వర్యంలో తూర్పు, దక్షిణ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ , నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఇతర సంఘాల వారికి అమ్మవారి జాతర ఆహ్వాన పత్రికలను సోమవారం అందజేశారు. ప్రధాన కార్యదర్శి పీల ప్రేమ్ కిరణ్ జగదీష్, మళ్ల రవికుమార్, సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణకు అడ్డుకట్ట



ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌లు తొలగించిన తరువాత ఖాళీగా ఉన్న రోడ్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంకోజీపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం బస్టాండ్ వెనుక మార్గంలో వాహనాలను నిలిపి శ్రీకాకుళం, విజయనగరం వెళ్తున్న వారిని 10 రోజులుగా జేఆర్‌నగర్ కాలనీ కార్యవర్గ సభ్యులు నిలువరిస్తున్నారు. ఎంవీపీ ట్రాఫిక్ పోలీసుల సహకారంతో రోడ్డుపై అనధికారికంగా పార్కింగ్ చేస్తున్న వారిపై చర్యలు చేపట్టారు. ఇక్కడ వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.నాలుగు చక్రాల వాహనాలను నిరోధించి, చిన్న చిన్న బడ్డీలను తొలగింపజేశారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందితో ఈ మార్గాన్ని శుభ్రంగా తీర్చిదిద్దారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు, పోలీసు సిబ్బంది స్పందించి, కాలనీ సభ్యులు తీసుకున్న చర్యలకు సహకరించి కాలనీని శుభ్రంగా తీర్చిదిద్దారు. దీంతో కాలనీలోని రోడ్డు నెంబరు 3 శివాలయం వైపు రహదారి విశాలంగా మారడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు సహకరించిన 'ఆంధ్రజ్యోతి'కి, జీవీఎంసీ, పోలీసు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

పేదరికాన్ని జయించేది చదువు మాత్రమే



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న దాత రవికుమార్

ఆరిలోవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పేదరికాన్ని జయించే శక్తి చదువుకు మాత్రమే ఉంటుందని సాఫ్ట్‌వేర్ ఇంజనీరు రవికుమార్ అన్నారు. చదువుకు పేద, ధనిక అనే తేడా ఉండదన్నారు.ఆరిలోవ గాంధీనగర్‌లోగల నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస్ విద్యాలయ వసతిగృహంలో 150 మంది విద్యార్థులకు ఆయన సోమవారం తన సొంత నిధులతో నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తాను బాగా చదువుకుని ఈ స్థాయిలో ఉండడం వల్ల మరికొందరికి కొంత సహాయం చేయగలుగుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, మూది అప్పారావు, కార్మిక అధికారి ఎల్లాజీ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఐ జగన్‌మోహన్

పెదవాల్తేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు ఎవరైనా పాల్పడితే 112కు ఫోన్ చేయాలని ఆర్ఎస్ఐ జగన్‌మోహన్ సూచించారు. విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు పాల్పడి, తోటి విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. సోమవారం ఈస్టు పాయింట్ కాలనీలో గల గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో విద్యార్థులకు మంచి స్పర్శ (గుడ్ టచ్), చెడు స్పర్శ (బ్యాడ్ టచ్), ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, శక్తి యాప్, పోక్సో చట్టం అందులో ఉన్న అనేక అంశాలపై అవగాహన కల్పించారు. మత్తుకు బానిస కాకుండా, క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు హితవు పలికారు. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాలు, ఈస్ట్ డీసీపీ లక్ష్మణమూర్తి సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బి.పోలరాజు, ఆర్.భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల కోసం వినతి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

వెంకోజీపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి):ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్. ధనుంజయరావుకు తెలుగునాడు ఉద్యోగుల సంక్షేమ సంఘం (ఏయూటీఈడబ్ల్యుఏ) ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. సోమవారం రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆయనను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు.రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, యూనివర్సిటీలో ఒకే స్థానంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారికి అంతర్గత బదిలీలు చేయాలని, టైం స్కేలు, రిటైర్మెంట్ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, క్యాంపస్‌లో రాజకీయ కార్యక్రమాలను నిలువరించాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

వైసీసీ నేతపై చర్యకు వినతి



కంచరపాలెం సీఐకి ఫిర్యాదు అందజేస్తున్న కూటమి నాయకులు

జ్ఞానాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జ్ఞానాపురం వాసి, వైసీపీ నేత కోడిగుడ్ల శ్రీధర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని 41వవార్డు కూటమి నాయకులు సోమవారం కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో సీఐకి ఫిర్యాదు చేశారు. నాయకులు ఐతి మధుబాబు, సంజీవరావు, అంతోని శేఖర్, గవర రమణ తదితరులు సీఐని కలిసినవారిలో ఉన్నారు.

కేకే లైనులో రైళ్లు రద్దు గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్, సమలేశ్వర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తూ గమ్యాలను కుదించి కొరాపుట్ వరకే నడిపిస్తామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్-విశాఖ మధ్య నడిచే రాత్రి ఎక్స్‌ప్రెస్‌లు మంగళ, బుధవారాల్లో విశాఖ, కొరాపుట్‌ల వరకే (రెండు వైపులా) నడుస్తాయన్నారు. విశాఖ-కిరండూల్ మధ్య రెండువైపులా నడిచే పాసింజర్‌లు కూడా రెండు వైపులా గమ్యాలను కుదించినట్లు తెలిపారు. హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం హౌరాలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో బుధ, గురువారాల్లో కొరాపుట్‌లో బయలుదేరి హౌరా వరకు నడుస్తుందన్నారు. ఈ సర్వీసులకు కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. రూర్కెలా-జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మంగళవారం రూర్కెలాలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో మంగళ, బుధవారాల్లో కొరాపుట్‌లో బయలుదేరి రూర్కెలా చేరుతుంది. హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం భువనేశ్వర్‌లో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో మంగళ, బుధవారాల్లో కొరాపుట్ నుంచి బయలుదేరి భువనేశ్వర్ వరకు నడుస్తుందని తెలిపారు.

సత్యానగర్ దేవస్థానం దుకాణాలకు 31న వేలం

మాధవధార, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని సత్యానగర్ సోమేశ్వర దేవస్థానానికి చెందిన మూడు దుకాణాల్ని వేలం పాట ద్వారా కేటాయించనున్నట్లు ఆలయ ఈఓ పి.సత్యనారాయణమూర్తి తెలిపారు. కంచరపాలెం పోలీసు స్టేషను ఎదుట ఉన్న ఈ షాపులను మూడేళ్ల కాలానికి లీజుకు ఇస్తామన్నారు. దరఖాస్తుదారులు ఆలయం వద్ద ఉంచిన టెండర్ బాక్సుల్లో కొటేషన్ పత్రాల్ని వేయాలి. దేవస్థానం ఆవరణలోనే బహిరంగ వేలం ద్వారా షాపుల్ని కేటాయిస్తామని తెలిపారు.

దివ్యాంగులకు బాసటగా నిలవాలి

ఒడిశా గవర్నర్ హరిబాబు సతీమణి జయశ్రీ

సాగర్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ దివ్యాంగులకు అండగా నిలవాలని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు సతీమణి కంభంపాటి జయశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం ఆమె గీతం ఆస్పత్రి వైద్యులతో కలిసి బీచ్ రోడ్డులో ఉన్న అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల్లో కంటిచూపు మెరుగుపరచడానికి ఆధునిక టెక్నాలజీ సహాయంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తామనిఆమె చెప్పారు. కంటిచూపు తక్కువ ఉన్న వారికి కళ్లజోళ్లు, నాణ్యత గల కాంటాక్ట్ లెన్స్ అందజేస్తామన్నారు. సదరం సర్టిఫికెట్లలో రెండు కళ్లూ లేకుంటే శతశాతం, ఒక కన్ను లేకపోతే 20 శాతం ఇస్తున్నారని, దీనివల్ల దివ్యాంగులు ప్రయోజనంపొందలేకపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ జీవోను సరిచేయాలని జయశ్రీ కోరారు. నేత్ర వైద్యులు నరసింగరావు, రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు.

జీవీఎంసీ ఆదాయానికి గండికొడుతున్న ఆక్రమణలు

» 41వ వార్డులో ఆక్రమిత స్థలంలో దుకాణాలు » రాజకీయ పలుకుబడితో దర్జాగా కబ్జా » అద్దెకు ఇచ్చి సొమ్ముచేసుకుంటున్న ప్రబుద్ధులు



ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతంలో జీవీఎంసీ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

జ్ఞానాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 41, 56 వార్డులకు సరిహద్దుగా ఉన్న ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతంలో జీవీఎంసీ స్థలంలో అక్రమంగా దుకాణాలు వెలిశాయి. ఇప్పుడు వాటిని వైన్‌షాపులు, టీ టైమ్‌లు, ఆటోమొబైల్స్ దుకాణాలు నడిపేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఈ దుకాణాలన్నీ ఒకరిద్దరి చేతుల్లోనే ఉన్నాయని స్థానికులు అంటున్నారు. గతంలో జీవనోపాధి కోసం కొంతమంది దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ అధికారులు ఇప్పటివరకు వాటి విషయమై పట్టించుకోలేదు. కానీ ఇదే ప్రాంతానికి చెందిన ఒకరిద్దరు వాటిని స్వాధీనం చేసుకొని మరింత రోడ్డుపైకి చొచ్చుకువచ్చి నిర్మాణాలు చేపట్టి వేలాది రూపాయలు అద్దెలు వసూలు చేస్తూ జీవీఎంసీ ఆదాయానికి గండికొడుతున్నారు. అయినా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఇదే ఆక్రమిత స్థలంలో ఇటీవల దేవాలయం, పాఠశాలలు, కళాశాలలకు దగ్గరగా ఉన్న చోట మద్యం దుకాణం వెలిసింది. ఆక్రమిత స్థలంలో ఉన్న దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా ఎక్సైజ్ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారో తెలియదు. మద్యం దుకాణం ఏర్పాటుచేయాలంటే డోర్‌నెంబరుతో కూడిన పన్ను చెల్లింపు పుస్తకం సమర్పించాలి. ఆక్రమిత దుకాణానికి జీవీఎంసీ ఎటువంటి పన్నుగాని డోర్‌నెంబరు కానీ జారీ చేయదు. స్థానికుల నుంచి అభ్యంతరాలు ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా ఎలా ఏర్పాటు చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా దుకాణాలు ఉన్న ప్రాంతం దక్షిణ , పశ్చిమ నియోజకవర్గాలకు మధ్యన ఉండడంతో ఎమ్మెల్యేలు గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదని స్థానికులు అంటున్నారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన పైడిమాంబ అమ్మవారి ఆలయానికి ప్రతి రోజూ పెద్దసంఖ్యలో మహిళలు, చిన్నారులు వస్తుంటారు. దుకాణం ఏర్పాటు చేసిన ప్రాంతం దగ్గరలోనే పాఠశాలలు, జూనియర్ కళాశాల ఉండడంతో నిత్యం ఇదే దారిగుండా విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. వారికి మందుబాబుల నుంచి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. దుకాణం ఏర్పాటు చేసిన ప్రాంతం దగ్గరలోనే ఇటీవల హత్య జరిగింది. దీనిపై ఇంకా దర్యాప్తు జరుగుతోంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మద్యం దుకాణం తొలగించి, ఆక్రమిత దుకాణాలను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో వసతుల మెరుగుకు కృషి

» ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ



ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

డాబాగార్డెన్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు కిరణ్మయి, అరుణపద్మ, అచ్యుతరావు, రమేష్, మురళీ తదితరులు ఎమ్మెల్యేను కలిసి కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. సుమారు 1,900 మంది విద్యార్థినులు చదువుతున్న దృష్ట్యా అదనపు తరగతుల నిర్వహణకు భవన నిర్మాణం, పీజీ కోర్సు నిమిత్తం సైన్స్ ల్యాబ్, పరికరాలు అవసరమన్నారు. త్వరలోనే కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే కళాశాలను సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ ఆపండి

300 రోజులకు చేరిన నిరసన దీక్షలు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సంఘాల నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ యత్నాలు ఆపాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పద్మనాభరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న నిరసన దీక్షలు సోమవారానికి 300 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పోరాటం వల్ల గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి టెండర్‌కు ఎవరూ రాలేదన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం పోర్టు ఛైర్మన్ కమిటీని వేశారన్నారు. పోర్టు సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్నారు. ఆసుపత్రి ప్రైవేటీకరణ అనైతికమని, కార్మికుల కృషితోనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జీటీప్రకాశ్, గణేష్, కె.సత్యనారాయణ, జగన్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలపై మక్కువ అలవర్చుకోవాలి

» ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్



నృత్య పోటీల విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రాజశేఖర్ తదితరులు

డాబాగార్డెన్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ నాట్య కళలపై మక్కువ అలవర్చుకోవాలని ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ సూచించారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రపంచ నాట్య కళల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం నృత్యపోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో భాగమైన శాస్త్రీయ నాట్య కళలను ప్రోత్సహించవలసిన అవసరం ఉందన్నారు. అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ మాట్లాడుతూ వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. మన తెలుగు సంప్రదాయాన్ని ప్రతీ ఒక్కరికీ తెలియజేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. విజేతలకు అతిథులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నవ దంపతులకు బంగారు తాళిబొట్లు



అందుకున్న తాళిబొట్లతో నవ వధువులు, జనసేన నేత నాగబాబు, ఇతర నాయకులు

సీతంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో అరుగురు నవ వధువులకు తాళిబొట్లు, బాలికలకు వెండి పట్టీలు, పట్టువస్త్రాలను అందజేశారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీ, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, జనసేన పార్టీ నాయకులు తాతారావు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు సహించం: పరంజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న పరంజ్యోతి

సీతంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులపై దాడులు చేస్తే సహించేది లేదని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి పేర్కొన్నారు. నగరంలోని డైమండ్ పార్కు సమీపంలో సోమవారం ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దళిత హక్కుల సాధనకై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత క్రైస్తవులపై ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ ప్రభుత్వాలు ఎటువంటి సాయం చేయడం లేదన్నారు. దేశంలో మతమార్పిడి స్వేచ్ఛతో కూడిన హక్కు అని, దానిని కాలరాస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అనుమతులు లేని చర్చిలపై కూటమి ప్రభుత్వం దాడులు చేయిస్తోందని విమర్శించారు. ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ దళిత క్రైస్తవుల హక్కుల సాధన కోసం వివిధ రూపాల్లో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సామాజ్ పార్టీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ఆంక్షలు మూణ్నాళ్ల ముచ్చటేనా?

» బంకుల్లో విడిగా పెట్రోలు విక్రయాలు



స్కూటర్ డిక్కీలో బాటిల్‌లో, విడిగా క్యాన్‌లో పడుతూ..

మురళీనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గతంలో ఓ యువతిని పెట్రోల్ పోసి తగులబెట్టిన సంఘటన సంచలనం రేపిన నేపథ్యంలో పెట్రోల్ బంక్‌ల్లో లూజ్ పెట్రోల్ అమ్మకాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. క్యాన్లు, నీళ్ల సీసాల్లో పెట్రోలు పట్టి తీసుకెళ్లడం, వాహనాల్లో తరలించడం కుదరదని ప్రభుత్వం స్పష్టం చేసింది. పెట్రోలు బంకు నిర్వాహకులు ఈ ఆదేశాలు పాటించాలని ఉన్నతాధికారులు పేర్కొన్నా ఆంక్షల అమలు కొన్ని బంకుల్లో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఇటీవల మురళీనగర్ బిర్లాజంక్షన్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, ఆర్‌అండ్‌బీ హైవేలో జియో బర్పానీ పెట్రోలియం యాజమాన్యానికి తనిఖీల తర్వాత జిల్లా జాయింటు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. లూజ్ అమ్మకాల నిషేధం పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అయినా ఇపుడు మళ్లీ దాదాపు ప్రతి పెట్రోల్ బంక్‌లోనూ యథేచ్ఛగా పెట్రోలు లూజుగా అమ్మేస్తున్నారు. తాటిచెట్లపాలెంలో వైసీపీ నాయకుడికి చెందిన బంక్‌లో ఈ తరహా అమ్మకాలు నిత్యకృత్యంగా మారాయి. చుట్టూ నివాస సముదాయాల్ని ఆనుకొని ఉండే ఈ బంక్‌లో నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. అధికారులు చూసీచూడనట్టుగా మిన్నకుంటున్నారు. నిషేధఉత్తర్వులు బేఖాతరు చేస్తున్న పెట్రోల్ బంక్‌ల్లో కొనుగోలు సమయాల్లో వాహనాలతో వచ్చేవారికి ప్రమాదాలు తప్పేలా లేవని ద్విచక్రవాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేసే కంటే ముందస్తుగా నిబంధనలు పాటించేలా బంక్‌ల యజమానులను కట్టడి చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

విశాఖలో ఫిర్యాదుల పరిష్కారం భేష్

... 5వ పేజీ తరువాయి

పలువురు ఫిర్యాదు చేశారు. పెదజాలరిపేటలో గ్రామ కంఠంగా గుర్తించిన స్థలాలను ప్రజావసరాలకు అనుమతించాలని మత్స్యకార సంఘ నాయకులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం మంత్రి అనగాని మాట్లాడుతూ విశాఖ, తిరుపతిల్లో పీజీఆర్‌ఎస్ బాగా జరుగుతుందని, సమస్యల పరిష్కారంలో సానుకూలత ఉందన్నారు. ఇక్కడ అవలంబిస్తున్న విధానాలను చూసి మిగిలినచోట్ల అమలు చేసేందుకుగాను కార్యక్రమంలో భాగస్వామిని అయ్యానన్నారు. ప్రభుత్వ పథకాలు విశాఖలో బాగా అమలు జరుగుతున్నాయని ప్రశంసించారు. విశాఖ వాసులకు సానుకూల దృక్పథం ఎక్కువని, ఇక్కడ శాంతియుత వాతావరణం ఉండడంతో పెట్టుబడులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన నగరంగా విశాఖపట్నం నిలుస్తోందన్నారు. అందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖకు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారని, ఇదే విషయం తరచూ సమీక్షలలో గుర్తుచేస్తుంటారన్నారు.

ఐటీ రంగానికి ఊతమిస్తూ విశాఖ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని, ఫలితంగా చాలా కంపెనీలు వస్తున్నాయన్నారు. కాగా జిల్లాలో పీజీఆర్‌ఎస్ నిర్వహణ గురించి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వివరించారు. ప్రతి వారం వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత కాలంలో ఎండార్స్‌మెంట్ ఇస్తూ పరిష్కరిస్తున్నామన్నారు. ఇంకా క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహిస్తున్నామని, నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపుతున్నామన్నారు. పీజీఆర్‌ఎస్‌లో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సోమవారం పీజీఆర్‌ఎస్‌కు 427 ఫిర్యాదులు రాగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 180, తల్లికి వందనం పథకం అందలేదని సుమారు 80, జీవీఎంసీ సమస్యలపై 54 వచ్చాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం

కానిస్టేబుళ్లపై చర్యకు సీపీ ఆదేశం

సీతంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ విధుల్లో అప్రమత్తంగా ఉండాల్సిన పోలీసు సిబ్బంది నిద్రపోతుండడాన్ని గమనించిన నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వారిపై చర్యలకు ఆదేశించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారకా పోలీసు స్టేషన్లను ఆదివారం అర్ధరాత్రి దాటాక ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఉన్న సెంట్రీ సాధారణ దుస్తుల్లో (సివిల్ డ్రెస్)లో రికార్డులు చూస్తున్నాడు. ఒక మహిళ, ఒక పురుష కానిస్టేబుళ్లు నిద్రపోతుండడం చూసిన సీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అలాగే అదే మేడపై ఉన్న ద్వారకా పోలీసు స్టేషన్‌ను కూడా సందర్శించిన సీపీ అక్కడ తలుపులు వేసి ఉండటం గమనించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించినట్లు సమాచారం. దీంతో ఏసీపీ లక్ష్మణమూర్తి సోమవారం ఉదయం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కి వచ్చి పరిశీలించారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకస్వాములు

సింహాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

కోడి వ్యర్థాలు చేపల చెరువుకు తరలిస్తే రూ.50 వేలు జరిమానా

... 5వ పేజీ తరువాయి

జరిమానా విధించాలని ఆదేశించినట్టు తెలిసింది. ఇప్పటివరకూ 15 వాహనాలను పట్టుకుని సీజ్ చేసినందున వాటి నుంచి ఆ మేరకు జరిమానా వసూలుచేయడంపై అధికారులు దృష్టిసారించారు. కోడి వ్యర్థాల మాఫియా వెనుక ఉన్నవారెవరో గుర్తించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు చేపల చెరువులకు తరలిపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో కమిషనర్‌కు ఫిర్యాదు అందజేశారు.

కూటమిలో కొలిక్కిరాని కసరత్తు

... 5వ పేజీ తరువాయి

మేయర్ కోరారు. కాగా, ప్రస్తుతం కూటమి అభ్యర్థులుగా భీమిలి నుంచి ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, తూర్పు నియోజకవర్గం నుంచి 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, దక్షిణ నియోజకవర్గం నుంచి 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్, గాజువాక నుంచి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గం నుంచి దాడి వెంకటరామేశ్వరరావు పేర్లు దాదాపు ఖరారైనట్టు తెలిసింది. పెందుర్తి నుంచి శానాపతి వసంత, రాపర్తి కన్నా మధ్య, ఉత్తర నియోజకవర్గం నుంచి ముక్కా శ్రావణి, గంకల కవిత మధ్య పోటీ నెలకొంది. అనకాపల్లి నుంచి ఎవరికి అవకాశం ఇవ్వాలనేదానిపై నేతలు ఇంకా స్పష్టతకు రాలేదు. జనసేనకు మరొకటి ఇవ్వాల్సి వస్తే ఆ పార్టీ నేతలు ఎవరికి అవకాశం ఇస్తారో చూడాల్సి ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలు వరకు మాత్రమే నామినేషన్ల దాఖలుకు గడువు ఉండడంతో ఉదయాన్నే అభ్యర్థులను ప్రకటించి, వెంటనే నామినేషన్లు దాఖలు చేయిస్తామని కూటమి నేతలు చెబుతున్నారు.

రైల్వే జోన్‌కు రెడ్ సిగ్నల్స్!

... 5వ పేజీ తరువాయి

సంబంధించిన డీపీఆర్‌ను ఈ ఏడాది జనవరి నెలాఖరులో ఢిల్లీకి పంపితే ఆరు నెలలు దానిని మురగబెట్టి వారం క్రితం కొర్రీలతో ఆమోదించారు. రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఇచ్చేశారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ విశాఖపట్నం జోన్ నుంచి రాయగడలోకి వెళ్లిపోయింది. పార్వతీపురం సమీపానున్న కూనేరు కూడా రాయగడ డివిజన్‌కే ఇచ్చేశారు. కొత్తవలస నుంచి పలాస వరకు విశాఖపట్నం డివిజన్‌లో ఉంచారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టేషన్లన్నీ తూర్పు కోస్తా జోన్‌లోని ఖుర్దా డివిజన్‌లో ఉండిపోయాయి.

ఆర్‌ఆర్‌బీపై చర్చ శూన్యం

రైల్వేలో ఉద్యోగ అవకాశం రావాలంటే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్‌ఆర్‌బీ) నిర్వహించే పరీక్షలు రాయాలి. వాటికి హాజరయ్యేందుకు ఒడిశాలోని భువనేశ్వర్‌కు వెళితే..'ఆంధ్రావాళ్లు' అని వెనక్కి పంపించేసేవారు. ఆ నేపథ్యంలోనే విశాఖ కేంద్రంగా జోన్ ఏర్పాటుచేస్తే ఇక్కడే ఆర్‌ఆర్‌బీ కేంద్రం వస్తుందని యువత భావించింది. ఇప్పుడు జోన్ ప్రకటించినా ఇంకా ఆర్‌ఆర్‌బీ కేంద్రం ఇవ్వలేదు. దీనిపై ఎవరూ మాట్లాడడం లేదు. రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ వ్యవహరిస్తున్నారు. ఆయన జోన్ కార్యకలాపాల వేగవంతంపైన, ఆర్‌ఆర్‌బీ వంటి అంశాలపైనా దృష్టి సారించాలి. ఆయన ప్రయత్నిస్తే వెనువెంటనే ఆదేశాలు వస్తాయి.

ఇంజనీరింగ్‌లో బిల్లుల పంచాయితీ!

... 5వ పేజీ తరువాయి

ఆదేశించింది. దీంతో భీమిలి (జోన్-1) టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఆధ్వర్యంలో బీచ్‌లోని నిర్మాణాలను పరిశీలించారు. సుమారు ఆరు అడుగుల లోతున పుట్టింగ్‌లు వేసి 588 మీటర్ల మేర సిమెంట్ కాంక్రీట్ గోడ నిర్మించారని, దానిని తొలగించేందుకు అవసరమైన జేసీబీలను ఏర్పాటుచేయాలని కోరుతూ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ప్రతిపాదన పంపించారు. ఆ నిర్మాణాలను తొలగించాలంటే 200 కెపాసిటీ కలిగిన బ్రేకర్ జేసీబీ యంత్రాలు ఉండాలని, అవి జీవీఎంసీ వద్ద లేనందున ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకోవాల్సి ఉంటుందని, ఇందుకోసం సుమారు రూ.70 లక్షలు ఖర్చవుతుందని పేర్కొంటూ అంచనాలను అప్పటి జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన జిల్లా కలెక్టర్‌కు పంపించారు. తర్వాత మెకానికల్ విభాగం అధికారులు ఐదు ప్రైవేటు ఏజెన్సీల నుంచి ఐదు 200 బ్రేకర్ జేసీబీలతో బీచ్‌లో నిర్మించిన కాంక్రీట్‌గోడను పునాదులతో సహా తొలగించే పనులను మార్చి ఎనిమిదిన ప్రారంభించి, 17 రోజులపాటు కొనసాగించారు. అప్పటికి 321 మీటర్ల గోడను తొలగించి, డెబ్రిస్‌ను కాపులుప్పాడలోని యార్డుకు తరలించారు. అంతవరకూ అయిన బిల్లు చెల్లిస్తేనేగానీ మిగిలిన పనులను పూర్తిచేయలేమని కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. తాను యంత్రాలను ఎంగేజ్ చేయలేదు కాబట్టి, బిల్లు పెట్టలేనంటూ భీమిలి జోన్ ఈఈ అభ్యంతరం వ్యక్తంచేశారు. దాంతో కాంట్రాక్టర్లు మెకానికల్ విభాగం అధికారులను సంప్రతిస్తే పనుల అంచనాలను పబ్లిక్ వర్క్స్ ఈఈ...కలెక్టర్‌కు పంపించినందున అక్కడి నుంచే బిల్లు ప్రిపేర్ చేయాలని సమాధానం ఇచ్చారు. ఈలోగా మెకానికల్ ఈఈగా పనిచేసిన చిరంజీవి ఉద్యోగ విరమణ చేయగా, భీమిలి జోన్ ఈఈగా పనిచేసిన దిలీప్‌కుమార్‌కు జోన్-8కు బదిలీ అయిపోయింది. అనంతరం వచ్చిన అధికారులు బిల్లు పంచాయితీని ఒకరిపై ఒకరు నెట్టుకోవడం ప్రారంభించారు.

కమిషనర్‌కు ఫిర్యాదు

దీంతో కాంట్రాక్టర్లంతా గత నెల 30న జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి బిల్లు చెల్లింపులో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, వారి మధ్య సమన్వయలోపంపై ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ (ఫైనాన్స్)ను కమిషనర్‌ను ఆదేశించారు. అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో తాజాగా ఈనెల 21న జిల్లా కలెక్టర్‌ను కలిసి ఇంజనీరింగ్ అధికారుల తీరుపై ఫిర్యాదు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు తక్షణం పనులు ప్రారంభించాలని, తర్వాత వర్క్ ఆర్డర్‌ను ఇచ్చి ర్యాటిఫై చేయిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు తమను బలిచేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ పల్లంరాజును వివరణ కోరగా భీమిలి బీచ్‌లో నిర్మాణాల తొలగింపునకు సంబంధించిన బిల్లు చెల్లింపు విషయంలో మెకానికల్, పబ్లిక్ వర్క్స్ ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లోపించిందని అంగీకరించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని, బిల్లు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని మెకానికల్, పబ్లిక్స్‌వర్క్స్ అధికారులను ఆదేశించానన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఘనంగా గోదాదేవి జయంత్యుత్సవం

ఎంవీపీ కాలనీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరు వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. గోదా జయంతి సందర్భంగా ఉదయం తిరువారాధన, విష్వక్సేన ఆరాధన, నవకలశం, హోమం, 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారి విగ్రహదాత దంపతులు డాక్టర్ వెంపటి రామ నరసింహం,దుర్గారాణి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు లక్ష్మణస్వామి, శ్రీనివాస్, కమిటీ కార్యదర్శి ప్రసాదరావు, సభ్యులు జయరాం, గౌరి, జగన్, మూర్తి తదితరుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యానికి ధీమా ఇవ్వని బీమా

ఆరిలోవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న ప్రతి 20 మంది వృద్ధుల్లో ముగ్గురికి మాత్రమే ఆరోగ్య బీమా ఉందని ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్యశాల వైద్యుడు డాక్టర్ బ్రిజేష్ టక్కర్ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన సర్వేల ద్వారా ఈ విషయం వెల్లడైందన్నారు. ఇప్పటి బీమా విధానాలు నిష్ప్రయోజనమని వృద్ధులు భావిస్తున్నారని తెలిపారు. ఆయుష్మాన్‌భవ వంటి ప్రభుత్వ ఆరోగ్య పథకం ద్వారా బీమా విలువ కొంత పెరిగిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆరోగ్య సమానత్వం సాధించడంలో ఇవి కీలకమని ఈ అధ్యయన రచయితల్లో ఒకరైన డాక్టర్ రాజీవ్‌నారాయణ పేర్కొన్నారు. తగినంత బీమా కవరేజ్ ఉంటే సకాలంలో ఆరోగ్య సంరక్షణ పొందే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేయించరూ



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

ఆరిలోవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి):జీవీఎంసీ పరిధికి చెందిన పైనాపిల్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా గల ప్రభుత్వ బావి శిథిల స్థితికి చేరింది. ఈ బావి చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ స్థలం విలువ సుమారు రూ. కోటి వరకు ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఆక్రమణకు గురవుతున్నా వాటర్ వర్క్స్ వారు లేదా సచివాలయ సిబ్బంది పట్టించుకోలేదని పలువురు నుంచి విమర్శలు వస్తున్నాయి. బావి స్థలం చుట్టూ సెంటరింగ్ కర్రలు వేసి ఉంచారు. వీటి నిల్వతో దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సినిమా గైడ్

● **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

● **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 45, వంకాయలు(తెలుపు) 38,వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 34, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 26, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 22, క్యారెట్ 44, దొండకాయలు 28, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 66, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50,బద్ధచిక్కుడు 50, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 76, కీరదోస 30, కాప్సికమ్ 766, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 40, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

ఎవరి పని వారిదే!

» ఉన్నతాధికారులు ఆగ్రహిస్తారు
» స్థానిక అధికారులు పాటించరు
» యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
» జీవీఎంసీ ఆదాయానికి గండి
» 16వ వార్డులోని రజక వీధిలో పరిస్థితి

వెంకోజీపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై జీవీఎంసీ ఉన్నతాధికారులు ఆగ్రహిస్తూనే ఉంటారు.. ఆక్రమణలు తొలగించి, అనుమతులు లేని కట్టడాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిస్తారు. కానీ కింది స్థాయిలో (వార్డు సచివాలయం అధికారులు) 'తమ పని' తాము చేసుకుంటూ వెళ్లిపోతున్నారు. ఇచ్చిన అనుమతులను అతిక్రమించి బహుళ అంతస్థులు, ఆక్రమణ కట్టడాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఆక్రమణలకు తావివ్వకుండా చూడాలని, జీవీఎంసీ ఆదాయ వనరులు పెంచాలని పదే పదే మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ సమీక్ష సమావేశాల్లో అధికారులకు నిర్దేశిస్తున్నా కిందిస్థాయి సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. వారొచ్చి పరిశీలిస్తే కదా.. అన్న ధైర్యం వీరిలో ఉంది. జోన్-3 పరిధిలోని 16వ వార్డుకు చెందిన హెచ్‌బీకాలనీ రజక వీధిలో స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ స్థలాల్లో అనుమతి లేకుండా పక్కపక్కనే అదనపు అంతస్థు నిర్మించారు. ఈ బిల్డింగ్‌ల నిర్మాణంలో కొందరు అధికారులు చేతివాటం చూపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్డింగ్ అసెస్‌మెంట్ నెంబరు 1086/0580/బి/23/ఎంఈఎం/2025 ప్రకారం ఈ రెండు బిల్డింగ్‌లకు జీవీఎంసీ స్టిల్ట్, గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ , టెరస్‌ఫ్లోర్(వాటర్ ట్యాంకు) ల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. కానీ వీరు కోట్లాది రూపాయలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేసుకుని నియమాలు పాటించకుండా అనుమతులకు తగ్గినట్టుగా నిర్మించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. తాము చిన్న గది నిర్మించుకుంటేనే వెంటనే తమపై దాడి చేసి అపరాధ రుసుము వసూలు చేసే టౌన్‌ప్లానింగ్ అధికారులకు అనుమతులు లేకుండా బహుళ అంతస్తు నిర్మాణం, ప్రమాద నివారణ చర్యలు పాటించకుండా నిర్మాణం చేపడుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడమేమిటని స్థానికులు నిలదీస్తున్నారు. ఈ బిల్డింగ్ వ్యవహారంపై స్థానికంగా జోనల్ కార్యాలయానికి పలు ఫిర్యాదులు వచ్చినా ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

అనుమతులు ఉన్నంత వరకు ఓపెన్‌గా నిర్మించి, అక్రమ అంతస్థులు మాత్రం చుట్టూ పరదాలు కట్టి చాటుమాటుగా చేపడుతూ జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా నిర్మించే అక్రమ అంతస్థులను కేవలం నల్లధనం కలిగిన వారు మాత్రమే కొనుగోలుకు సిద్ధపడతారని, దాని వల్ల ఆదాయపు పన్నుకు కూడా గండి కొడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటిపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



రజకవీధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం



హెచ్‌బీ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ మార్గంలో అక్రమంగా నిర్మిస్తున్న భవనం

కూటమి పాలనపై ప్రజల్లో ఆదరణ

ఎమ్మెల్యే వెలగపూడి, మేయర్ పీలా



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

రామ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ పాలనలో చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల్లో మంచి ఆదరణ కనిపిస్తోందని మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని 28వ వార్డు రామ్‌నగర్‌లో వారిద్దరూ పర్యటించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తాగునీటి కొళాయిలలోనూ, ఇళ్లలోని చేతిపంపుల్లో మురుగు నీరు చేరి కలుషితమవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ వార్డు అధ్యక్షుడు నక్కా కనకరాజు తెలియజేయటంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. వీటిని తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, టీడీపీ వార్డు అధ్యక్షుడు నక్కా కనకరాజు, నక్కా అన్నపూర్ణ, ఉరుకూటి పైడిరాజు, డిల్లీశ్వరి, శ్యామల, వైసీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా రోడ్ల నిర్మాణం పూర్తి

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్

సిరిపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : భోగాపురం ఎయిర్‌పోర్టుకు అనుసంధానించే రహదారుల నిర్మాణం గడువులోగా పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వారు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో రహదారుల నిర్మాణంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఇప్పటికే కొన్ని పనులు చేపట్టగా మిగిలిన రహదారుల పనులను త్వరలోనే ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో బాధితులు మాస్టర్‌ప్లాన్‌పై ఇచ్చిన సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం మెట్రో రైల్ ప్రాజెక్టు వివరాలను వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా ప్రజాదర్బార్‌కు పది వినతులు రాగా వాటిలో ప్లానింగ్ విభాగానికి 6, పరిపాలనకు 2, ఇంజనీరింగ్‌కు 2 వినతులు వచ్చాయి. సమావేశంలో జాయింట్ కమిషనర్ కే. రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, సీపీఓ శిల్ప, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఇంజనీర్లు భవానీ శంకర్, బలరామరాజు , తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా హైస్కూల్ ఆవరణ



ఖాళీ మద్యం బాటిళ్లు

ఆరిలోవ, జూలై 28 ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాల గేటు సమీపంలో ప్రతిరోజూ రాత్రివేళ మందుబాబులు మద్యం తాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.ఈమేరకు అక్కడ ఖాళీ మద్యం సీసాలు కూడా కనిపిస్తున్నాయి. వీధి లైట్లు ఏర్పాటు చేయకపోవడం, పాఠశాలకు వాచ్‌మన్ లేకపోవడంతో రాత్రివేళ మందుబాబులు ఇక్కడికి చేరి, చిందులు వేస్తున్నారు.

అర్చకుడి అదృశ్యం కేసు దర్యాప్తునకు మరో బృందం

భీమిలి సీఐ తిరుమలరావు

భీమునిపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చోడేశ్వరాలయం అర్చకుడు ఏడిద గణేష్ సుబ్రహ్మణ్యశర్మ కేసు దర్యాప్తును మరొకరికి అప్పగిస్తామని సీఐ తిరుమలరావు సోమవారం తెలిపారు. శర్మ ఏప్రిల్ 24న ఇక్కడి నుంచి బయలుదేరి తిరుపతి వెళ్లారు. 26న స్వామి దర్శనం అయినట్టు భార్య మాధురికి ఫోన్‌లో తెలిపారు. తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ అయిపోయింది. అప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియలేదు. భీమిలి పోలీసులు జూన్ 13న మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తునకు హెచ్‌సీ ప్రసాద్‌ను నియమించారు. ఆయన ఆధ్వర్యంలో ఇరువురు కానిస్టేబుళ్లతో పాటు కుటుంబసభ్యులు తిరుపతి వెళ్లారు. అదృశ్యమైన అర్చకుడి స్మార్ట్ ఫోన్‌ను కనుగొన్నారు. బస్ చార్జీల కోసం రూ.700కు స్మార్ట్ ఫోన్‌ను అమ్మివేయగా, ఆ సెల్ నలుగురు చేతులు మారింది.

ఆ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని తీసుకురావడం జరిగింది. కాగా, తర్వాత ఎస్ఐ హరీష్‌ను దర్యాప్తు అధికారిగా ఈనెల ప్రారంభంలో నియమించారు. అయితే, ఆయన్ను సిటీ టాస్క్ ఫోర్స్‌కు అధికారులు అటాచ్ చేసినందున...ఈ కేసు గురించి నార్త్ ఏసీపీ దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా మరో ఎస్ఐను నియమించి, రెండు టీమ్‌లను తిరుపతి పంపించాలని కోరనున్నట్టు సీఐ చెప్పారు. కాగా, సుబ్రహ్మణ్యశర్మ భార్య మాధురి, ఆమె కుటుంబీకులు తిరుపతి, కాశీ, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాలలో గాలిస్తున్నారని, ఇంకా జాడ తెలియలేదని సీఐ తెలిపారు. ఒక పక్క కుటుంబసభ్యులు, మరోపక్క డిపార్టుమెంట్ పరంగా తాము కూడా ప్రయత్నించి ఈ కేసు మిస్టరీని త్వరలో ఛేదిస్తామన్నారు.

నీలగిరి తోటల సాగుపై రైతుల ఆసక్తి



అర్చకునిపాలెంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నీలగిరి మొక్కలు

పద్మనాభం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు నీలగిరి మొక్కల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పొలాల్లోను, ఖాళీ స్థలాల్లో ఈ మొక్కలు వేస్తున్నారు. ఉపాధి హామీ పథకం-సామాజిక అటవీ పథకం ద్వారా మొక్కలను సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ నర్సరీల్లో నీలగిరి, సరుగుడుతో పాటు జామ, ఉసిరి, కానుగ మొక్కలను పంపిణీ చేస్తున్నారు. వీటిలో ఇప్పటికే జామ, ఉసిరి, కానుగ మొక్కలను ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేశారు. పద్మనాభం, అర్చకునిపాలెం, శేరిఖండం గ్రామాల్లోని నర్సరీల్లో నీలగిరి, సరుగుడు తదితర 1.80 లక్షల మొక్కల వరకు అందుబాటులో ఉన్నాయి.అవసరమైన రైతులు ముందుకు వస్తే ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కాగా రైతులు నీలగిరి మొక్కల్లో కోన్ నీలగిరి మొక్కలపై మక్కువ చూపిస్తున్నారు. ఇవి తొందరగా పెరుగుదల రావడంతో పాటు చెట్లు కొట్టిన తరువాత కూడా కార్సితోట మొక్కల పెరుగుదల బాగుంటుంది. తక్కువ కాలంలో ఫలసాయం అందడంతో రైతులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. టిష్యూ కల్చర్ ద్వారా తయారు చేసిన కోన్ మొక్కలకు ఎక్కువగా డిమాండ్ ఉంది. ఒక్కో మొక్క రూ. 5 వరకు ప్రైవేటు నర్సరీల్లో విక్రయిస్తున్నారు. దీంతో అర్చకునిపాలెంలో ఎక్కువ మంది ఈ మొక్కల విక్రయం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఇవి ప్రధానంగా భద్రాచలంలో మాత్రమే లభ్యమవుతాయి.అక్కడి నుంచి వ్యాపారులు ఇక్కడికి తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు.

భావనారాయణస్వామికి వెండి మకరతోరణం



ఈవో సూర్యనారాయణకు వెండి మకరతోరణం అందజేస్తున్న దాత

సర్పవరం జంక్షన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామికి విశాఖ ఎస్ఆర్ పురానికి చెందిన వెంకటాచార్య వైదిక సంస్థానం నిర్వాహకుడు సాతులూరి గోపాలకృష్ణమా చార్యులు రూ.12 లక్షలు విలువ చేసే పది కిలోల వెండి మకరతోరణం చేయించారు. సోమవారం దీన్ని ఈవో తలాటం వెంకట సూర్యనారాయణ సమక్షంలో శ్రీమూల భావనారాయణస్వామికి అందజేశారు.

ప్రమాదకరంగా వాంబే కాలనీ గృహాలు

» శిథిలమైన శ్లాబ్, పెచ్చులూడుతున్న పోర్టుకో
» వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటూ జీవనం



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న పోర్టుకో

మధురవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మధురవాడ వాంబేకాలనీ ప్రజలు నిత్యం భయాందోళన మధ్య బతుకుతున్నారు. పాతికేళ్ల కిందట నిర్మించిన గృహాలు కనీస నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ కాలనీలో 120 బ్లాకుల్లో 3600 గృహాలను జీ ప్లస్ 3 తరహాలో ప్రభుత్వం నిర్మించింది. అప్పట్లో నగరంలోని పలు మురికివాడల్లో నివసిస్తున్న వారిని ఇక్కడికి తరలించి వసతి కల్పించారు. ప్రస్తుతం 120 బ్లాకుల్లో నిర్మించిన ఇళ్లు మరమ్మతుకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల శ్లాబ్ పెచ్చులూడి ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి. మెట్లు పూర్తిగా పాడయ్యాయి. బాల్కనీలు కూడా పెచ్చులూడి పడుతున్నాయి. గోడలు రంగులు వెలసి వెలవెలపోతున్నాయి. రెండేళ్ల కిందట ఒక బ్లాకులోని మెట్ల మార్గం కూలిపోయి ఇద్దరు గాయపడ్డారు. ప్రతిరోజూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్లాబ్ బాగాలేకపోవడంతో సీలింగ్ ఫ్యాన్లు కిందపడిపోతున్నాయి. మెట్ల మార్గంలో మూడో ఫ్లోర్‌కు చేరాలంటే గుండెలు అరచేతిలో పెట్టుకుంటున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో మరింత భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు.

కాలనీ ఇళ్లకు మరమ్మతులు చేయించాలని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గంటా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా భూలోకమాత అమ్మవారి తొలేళ్లు

నేటి ఉత్సవానికి ప్రముఖులకు ఆహ్వానం





ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కమిటీ సభ్యుల ఆహ్వానం (ఇన్‌సెట్లో) భూలోకమాత

వెంకోజీపాలెం, జూలై 28(ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత అమ్మవారి తొలేళ్లు సోమవారం ఘనంగా జరిగాయి.తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో మహిళ లు ఆలయాన్ని శుభ్రం చేసి, ముగ్గులతో మంగళవారం నిర్వహించే వార్షిక మహోత్సవంలో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో జిగేల్‌మనిపించారు. కమిటీ అధ్యక్షుడు ఆడారి సత్తిబాబు ఆధ్వర్యంలో తూర్పు, దక్షిణ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ , నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఇతర సంఘాల వారికి అమ్మవారి జాతర ఆహ్వాన పత్రికలను సోమవారం అందజేశారు. ప్రధాన కార్యదర్శి పీల ప్రేమ్ కిరణ్ జగదీష్, మళ్ల రవికుమార్, సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణకు అడ్డుకట్ట



ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌లు తొలగించిన తరువాత ఖాళీగా ఉన్న రోడ్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంకోజీపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం బస్టాండ్ వెనుక మార్గంలో వాహనాలను నిలిపి శ్రీకాకుళం, విజయనగరం వెళ్తున్న వారిని 10 రోజులుగా జేఆర్‌నగర్ కాలనీ కార్యవర్గ సభ్యులు నిలువరిస్తున్నారు. ఎంవీపీ ట్రాఫిక్ పోలీసుల సహకారంతో రోడ్డుపై అనధికారికంగా పార్కింగ్ చేస్తున్న వారిపై చర్యలు చేపట్టారు. ఇక్కడ వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.నాలుగు చక్రాల వాహనాలను నిరోధించి, చిన్న చిన్న బడ్డీలను తొలగింపజేశారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందితో ఈ మార్గాన్ని శుభ్రంగా తీర్చిదిద్దారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు, పోలీసు సిబ్బంది స్పందించి, కాలనీ సభ్యులు తీసుకున్న చర్యలకు సహకరించి కాలనీని శుభ్రంగా తీర్చిదిద్దారు. దీంతో కాలనీలోని రోడ్డు నెంబరు 3 శివాలయం వైపు రహదారి విశాలంగా మారడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు సహకరించిన 'ఆంధ్రజ్యోతి'కి, జీవీఎంసీ, పోలీసు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

పేదరికాన్ని జయించేది చదువు మాత్రమే



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న దాత రవికుమార్

ఆరిలోవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పేదరికాన్ని జయించే శక్తి చదువుకు మాత్రమే ఉంటుందని సాఫ్ట్‌వేర్ ఇంజనీరు రవికుమార్ అన్నారు. చదువుకు పేద, ధనిక అనే తేడా ఉండదన్నారు.ఆరిలోవ గాంధీనగర్‌లోగల నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస్ విద్యాలయ వసతిగృహంలో 150 మంది విద్యార్థులకు ఆయన సోమవారం తన సొంత నిధులతో నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తాను బాగా చదువుకుని ఈ స్థాయిలో ఉండడం వల్ల మరికొందరికి కొంత సహాయం చేయగలుగుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, మూది అప్పారావు, కార్మిక అధికారి ఎల్లాజీ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.


లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఐ జగన్‌మోహన్

పెదవాల్తేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు ఎవరైనా పాల్పడితే 112కు ఫోన్ చేయాలని ఆర్ఎస్ఐ జగన్‌మోహన్ సూచించారు. విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు పాల్పడి, తోటి విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. సోమవారం ఈస్టు పాయింట్ కాలనీలో గల గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో విద్యార్థులకు మంచి స్పర్శ (గుడ్ టచ్), చెడు స్పర్శ (బ్యాడ్ టచ్), ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, శక్తి యాప్, పోక్సో చట్టం అందులో ఉన్న అనేక అంశాలపై అవగాహన కల్పించారు. మత్తుకు బానిస కాకుండా, క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు హితవు పలికారు. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాలు, ఈస్ట్ డీసీపీ లక్ష్మణమూర్తి సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బి.పోలరాజు, ఆర్.భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల కోసం వినతి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

వెంకోజీపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి):ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావుకు తెలుగునాడు ఉద్యోగుల సంక్షేమ సంఘం (ఏయూటీఈడబ్ల్యుఏ) ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. సోమవారం రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆయనను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు.రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, యూనివర్సిటీలో ఒకే స్థానంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారికి అంతర్గత బదిలీలు చేయాలని, టైం స్కేలు, రిటైర్మెంట్ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, క్యాంపస్‌లో రాజకీయ కార్యక్రమాలను నిలువరించాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

వైసీపీ నేతపై చర్యకు వినతి



కంచరపాలెం సీఐకి ఫిర్యాదు అందజేస్తున్న కూటమి నాయకులు

జ్ఞానాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జ్ఞానాపురం వాసి, వైసీపీ నేత కోడిగుడ్ల శ్రీధర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని 41వవార్డు కూటమి నాయకులు సోమవారం కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో సీఐకి ఫిర్యాదు చేశారు. నాయకులు ఐతి మధుబాబు, సంజీవరావు, అంతోని శేఖర్, గవర రమణ తదితరులు సీఐని కలిసినవారిలో ఉన్నారు.

కేకే లైనులో రైళ్లు రద్దు గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్, సమలేశ్వర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తూ గమ్యాలను కుదించి కొరాపుట్ వరకే నడిపిస్తామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్-విశాఖ మధ్య నడిచే రాత్రి ఎక్స్‌ప్రెస్‌లు మంగళ, బుధవారాల్లో విశాఖ, కొరాపుట్‌ల వరకే (రెండు వైపులా) నడుస్తాయన్నారు. విశాఖ-కిరండూల్ మధ్య రెండువైపులా నడిచే పాసింజర్‌లు కూడా రెండు వైపులా గమ్యాలను కుదించినట్లు తెలిపారు. హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం హౌరాలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో బుధ, గురువారాల్లో కొరాపుట్‌లో బయలుదేరి హౌరా వరకు నడుస్తుందన్నారు. ఈ సర్వీసులకు కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. రూర్కెలా-జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మంగళవారం రూర్కెలాలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో మంగళ, బుధవారాల్లో కొరాపుట్‌లో బయలుదేరి రూర్కెలా చేరుతుంది. హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం భువనేశ్వర్‌లో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో మంగళ, బుధవారాల్లో కొరాపుట్ నుంచి బయలుదేరి భువనేశ్వర్ వరకు నడుస్తుందని తెలిపారు.

సత్యానగర్ దేవస్థానం దుకాణాలకు 31న వేలం

మాధవధార, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని సత్యానగర్ సోమేశ్వర దేవస్థానానికి చెందిన మూడు దుకాణాల్ని వేలం పాట ద్వారా కేటాయించనున్నట్లు ఆలయ ఈఓ పి.సత్యనారాయణమూర్తి తెలిపారు. కంచరపాలెం పోలీసు స్టేషను ఎదుట ఉన్న ఈ షాపులను మూడేళ్ల కాలానికి లీజుకు ఇస్తామన్నారు. దరఖాస్తుదారులు ఆలయం వద్ద ఉంచిన టెండర్ బాక్సుల్లో కొటేషన్ పత్రాల్ని వేయాలి. దేవస్థానం ఆవరణలోనే బహిరంగ వేలం ద్వారా షాపుల్ని కేటాయిస్తామని తెలిపారు.

దివ్యాంగులకు బాసటగా నిలవాలి

ఒడిశా గవర్నర్ హరిబాబు సతీమణి జయశ్రీ

సాగర్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ దివ్యాంగులకు అండగా నిలవాలని ఒడిశా గవర్నర్ కంభపాటి హరిబాబు సతీమణి కంభంపాటి జయశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం ఆమె గీతం ఆస్పత్రి వైద్యులతో కలిసి బీచ్ రోడ్డులో ఉన్న అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల్లో కంటిచూపు మెరుగుపరచడానికి ఆధునిక టెక్నాలజీ సహాయంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తామనిఆమె చెప్పారు. కంటిచూపు తక్కువ ఉన్న వారికి కళ్లజోళ్లు, నాణ్యత గల కాంటాక్ట్ లెన్స్ అందజేస్తామన్నారు. సదరం సర్టిఫికెట్లలో రెండు కళ్లూ లేకుంటే శతశాతం, ఒక కన్ను లేకపోతే 20 శాతం ఇస్తున్నారని, దీనివల్ల దివ్యాంగులు ప్రయోజనంపొందలేకపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ జీవోను సరిచేయాలని జయశ్రీ కోరారు. నేత్ర వైద్యులు నరసింగరావు, రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు.

జీవీఎంసీ ఆదాయానికి గండికొడుతున్న ఆక్రమణలు

» 41వ వార్డులో ఆక్రమిత స్థలంలో దుకాణాలు » రాజకీయ పలుకుబడితో దర్జాగా కబ్జా » అద్దెకు ఇచ్చి సొమ్ముచేసుకుంటున్న ప్రబుద్ధులు



ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతంలో జీవీఎంసీ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

జ్ఞానాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 41, 56 వార్డులకు సరిహద్దుగా ఉన్న ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతంలో జీవీఎంసీ స్థలంలో అక్రమంగా దుకాణాలు వెలిశాయి. ఇప్పుడు వాటిని వైన్‌షాపులు, టీ టైమ్‌లు, ఆటోమోబైల్స్ దుకాణాలు నడిపేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఈ దుకాణాలన్నీ ఒకరిద్దరి చేతుల్లోనే ఉన్నాయని స్థానికులు అంటున్నారు. గతంలో జీవనోపాధి కోసం కొంతమంది దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ అధికారులు ఇప్పటివరకు వాటి విషయమై పట్టించుకోలేదు. కానీ ఇదే ప్రాంతానికి చెందిన ఒకరిద్దరు వాటిని స్వాధీనం చేసుకొని మరింత రోడ్డుపైకి చొచ్చుకువచ్చి నిర్మాణాలు చేపట్టి వేలాది రూపాయలు అద్దెలు వసూలు చేస్తూ జీవీఎంసీ ఆదాయానికి గండికొడుతున్నారు. అయినా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఇదే ఆక్రమిత స్థలంలో ఇటీవల దేవాలయం, పాఠశాలలు, కళాశాలలకు దగ్గరగా ఉన్న చోట మద్యం దుకాణం వెలిసింది. ఆక్రమిత స్థలంలో ఉన్న దుకాణలో నిబంధనలకు విరుద్ధంగా ఎక్సైజ్ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారో తెలియదు. మద్యం దుకాణం ఏర్పాటుచేయాలంటే డోర్‌నెంబరుతో కూడిన పన్ను చెల్లింపు పుస్తకం సమర్పించాలి. ఆక్రమిత దుకాణానికి జీవీఎంసీ ఎటువంటి పన్నుగాని డోర్‌నెంబరు కానీ జారీ చేయదు. స్థానికుల నుంచి అభ్యంతరాలు ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా ఎలా ఏర్పాటు చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా దుకాణాలు ఉన్న ప్రాంతం దక్షిణ , పశ్చిమ నియోజకవర్గాలకు మధ్యన ఉండడంతో ఎమ్మెల్యేలు గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదని స్థానికులు అంటున్నారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన పైడిమాంబ అమ్మవారి ఆలయానికి ప్రతి రోజూ పెద్దసంఖ్యలో మహిళలు, చిన్నారులు వస్తుంటారు. దుకాణం ఏర్పాటు చేసిన ప్రాంతం దగ్గరలోనే పాఠశాలలు, జూనియర్ కళాశాల ఉండడంతో నిత్యం ఇదే దారిగుండా విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. వారికి మందుబాబుల నుంచి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. దుకాణం ఏర్పాటు చేసిన ప్రాంతం దగ్గరలోనే ఇటీవల హత్య జరిగింది. దీనిపై ఇంకా దర్యాప్తు జరుగుతోంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మద్యం దుకాణం తొలగించి, ఆక్రమిత దుకాణాలను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో వసతుల మెరుగుకు కృషి

» ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ



ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

డాబాగార్డెన్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు కిరణ్మయి, అరుణపద్మ, అచ్యుతరావు, రమేష్, మురళీ తదితరులు ఎమ్మెల్యేను కలిసి కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. సుమారు 1,900 మంది విద్యార్థినులు చదువుతున్నందున అదనపు తరగతుల నిర్వహణకు భవన నిర్మాణం, పీజీ కోర్సు నిమిత్తం సైన్స్ ల్యాబ్, పరికరాలు అవసరమన్నారు. త్వరలోనే కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే కళాశాలను సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ ఆపండి

300 రోజులకు చేరిన నిరసన దీక్షలు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సంఘాల నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ యత్నాలు ఆపాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పద్మనాభరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న నిరసన దీక్షలు సోమవారానికి 300 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పోరాటం వల్ల గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి టెండర్‌కు ఎవరూ రాలేదన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం పోర్టు చైర్మన్ కమిటీని వేశారన్నారు. పోర్టు సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్నారు. ఆసుపత్రి ప్రైవేటీకరణ అనైతికమని, కార్మికుల కృషితోనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జీటీప్రకాశ్, గణేష్, కె.సత్యనారాయణ, జగన్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలపై మక్కువ అలవర్చుకోవాలి

» ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్



నృత్య పోటీల విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రాజశేఖర్ తదితరులు

డాబాగార్డెన్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ నాట్య కళలపై మక్కువ అలవర్చుకోవాలని ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ సూచించారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రపంచ నాట్య కళల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం నృత్యపోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో భాగమైన శాస్త్రీయ నాట్య కళలను ప్రోత్సహించవలసిన అవసరం ఉందన్నారు. అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ మాట్లాడుతూ వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. మన తెలుగు సంప్రదాయాన్ని ప్రతీ ఒక్కరికీ తెలియజేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. విజేతలకు అతిథులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నవ దంపతులకు బంగారు తాళిబొట్లు



అందుకున్న తాళిబొట్లతో నవ వధువులు, జనసేన నేత నాగబాబు, ఇతర నాయకులు

సీతంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో అరుగురు నవ వధువులకు తాళిబొట్లు, బాలికలకు వెండి పట్టీలు, పట్టువస్త్రాలను అందజేశారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీ, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, జనసేన పార్టీ నాయకులు తాతారావు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు సహించం: పరంజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న పరంజ్యోతి

సీతంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులపై దాడులు చేస్తే సహించేది లేదని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి పేర్కొన్నారు. నగరంలోని డైమండ్ పార్కు సమీపంలో సోమవారం ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దళిత హక్కుల సాధనకై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత క్రైస్తవులపై ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ ప్రభుత్వాలు ఎటువంటి సాయం చేయడం లేదన్నారు. దేశంలో మత మార్పిడి స్వేచ్ఛతో కూడిన హక్కు అని, దానిని కాలరాస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అనుమతులు లేని చర్చిలపై కూటమి ప్రభుత్వం దాడులు చేయిస్తోందని విమర్శించారు. ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ దళిత క్రైస్తవుల హక్కుల సాధన కోసం వివిధ రూపాల్లో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సామాజ్ పార్టీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం

కానిస్టేబుళ్లపై చర్యకు సీపీ ఆదేశం

సీతంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ విధుల్లో అప్రమత్తంగా ఉండాల్సిన పోలీసు సిబ్బంది నిద్రపోతుండడాన్ని గమనించిన నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వారిపై చర్యలకు ఆదేశించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారకా పోలీసు స్టేషన్లను ఆదివారం అర్ధరాత్రి దాటాక ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఉన్న సెంట్రీ సాధారణ దుస్తుల్లో (సివిల్ డ్రెస్)లో రికార్డులు చూస్తున్నాడు. ఒక మహిళ, ఒక పురుష కానిస్టేబుళ్లు నిద్రపోతుండడం చూసిన సీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అలాగే అదే మేడపై ఉన్న ద్వారకా పోలీసు స్టేషన్‌ను కూడా సందర్శించిన సీపీ అక్కడ తలుపులు వేసి ఉండటం గమనించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించినట్లు సమాచారం. దీంతో ఏసీపీ లక్ష్మణమూర్తి సోమవారం ఉదయం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కి వచ్చి పరిశీలించారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకస్వాములు

సింహాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

కోడి వ్యర్థాలు చేపల చెరువుకు తరలిస్తే రూ.50 వేలు జరిమానా

... 5వ పేజీ తరువాయి

జరిమానా విధించాలని ఆదేశించినట్టు తెలిసింది. ఇప్పటివరకూ 15 వాహనాలను పట్టుకుని సీజ్ చేసినందున వాటి నుంచి ఆ మేరకు జరిమానా వసూలుచేయడంపై అధికారులు దృష్టిసారించారు. కోడి వ్యర్థాల మాఫియా వెనుక ఉన్నవారెవరో గుర్తించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు చేపల చెరువులకు తరలిపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు సోమవారం పీజీఆర్ఎస్‌లో కమిషనర్‌కు ఫిర్యాదు అందజేశారు.

కూటమిలో కొలిక్కిరాని కసరత్తు

... 5వ పేజీ తరువాయి

మేయర్ కోరారు. కాగా, ప్రస్తుతం కూటమి అభ్యర్థులుగా భీమిలి నుంచి ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, తూర్పు నియోజకవర్గం నుంచి 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, దక్షిణ నియోజకవర్గం నుంచి 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్, గాజువాక నుంచి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గం నుంచి దాడి వెంకటరామేశ్వరరావు పేర్లు దాదాపు ఖరారైనట్టు తెలిసింది. పెందుర్తి నుంచి శానాపతి వసంత, రాపర్తి కన్నా మధ్య, ఉత్తర నియోజకవర్గం నుంచి ముక్కా శ్రావణి, గంకల కవిత మధ్య పోటీ నెలకొంది. అనకాపల్లి నుంచి ఎవరికి అవకాశం ఇవ్వాలనేదానిపై నేతలు ఇంకా స్పష్టతకు రాలేదు. జనసేనకు మరొకటి ఇవ్వాల్సి వస్తే ఆ పార్టీ నేతలు ఎవరికి అవకాశం ఇస్తారో చూడాల్సి ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలు వరకు మాత్రమే నామినేషన్ల దాఖలుకు గడువు ఉండడంతో ఉదయాన్నే అభ్యర్థులను ప్రకటించి, వెంటనే నామినేషన్లు దాఖలు చేయిస్తామని కూటమి నేతలు చెబుతున్నారు.

రైల్వే జోన్‌కు రెడ్ సిగ్నల్స్!

... 5వ పేజీ తరువాయి

సంబంధించిన డీపీఆర్‌ను ఈ ఏడాది జనవరి నెలాఖరులో ఢిల్లీకి పంపితే ఆరు నెలలు దానిని మురగబెట్టి వారం క్రితం కొర్రీలతో ఆమోదించారు. రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఇచ్చేశారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ విశాఖపట్నం జోన్ నుంచి రాయగడలోకి వెళ్లిపోయింది. పార్వతీపురం సమీపానున్న కూనేరు కూడా రాయగడ డివిజన్‌కే ఇచ్చేశారు. కొత్తవలస నుంచి పలాస వరకు విశాఖపట్నం డివిజన్‌లో ఉంచారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టేషన్లన్నీ తూర్పు కోస్తా జోన్‌లోని ఖుర్దా డివిజన్‌లో ఉండిపోయాయి.

ఆర్‌ఆర్‌బీపై చర్చ శూన్యం

రైల్వేలో ఉద్యోగ అవకాశం రావాలంటే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్‌ఆర్‌బీ) నిర్వహించే పరీక్షలు రాయాలి. వాటికి హాజరయ్యేందుకు ఒడిశాలోని భువనేశ్వర్‌కు వెళితే..'ఆంధ్రావాళ్లు' అని వెనక్కి పంపించేసేవారు. ఆ నేపథ్యంలోనే విశాఖ కేంద్రంగా జోన్ ఏర్పాటుచేస్తే ఇక్కడే ఆర్‌ఆర్‌బీ కేంద్రం వస్తుందని యువత భావించింది. ఇప్పుడు జోన్ ప్రకటించినా ఇంకా ఆర్‌ఆర్‌బీ కేంద్రం ఇవ్వలేదు. దీనిపై ఎవరూ మాట్లాడడం లేదు. రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ వ్యవహరిస్తున్నారు. ఆయన జోన్ కార్యకలాపాల వేగవంతంపైన, ఆర్‌ఆర్‌బీ వంటి అంశాలపైనా దృష్టి సారించాలి. ఆయన ప్రయత్నిస్తే వెనువెంటనే ఆదేశాలు వస్తాయి.

ఇంజనీరింగ్‌లో బిల్లుల పంచాయితీ!

... 5వ పేజీ తరువాయి

ఆదేశించింది. దీంతో భీమిలి (జోన్-1) టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఆధ్వర్యంలో బీచ్‌లోని నిర్మాణాలను పరిశీలించారు. సుమారు ఆరు అడుగుల లోతున ఫుట్టింగ్‌లు వేసి 588 మీటర్ల మేర సిమెంట్ కాంక్రీట్ గోడ నిర్మించారని, దానిని తొలగించేందుకు అవసరమైన జేసీబీలను ఏర్పాటుచేయాలని కోరుతూ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ప్రతిపాదన పంపించారు. ఆ నిర్మాణాలను తొలగించాలంటే 200 కెపాసిటీ కలిగిన బ్రేకర్ జేసీబీ యంత్రాలు ఉండాలని, అవి జీవీఎంసీ వద్ద లేనందున ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకోవాల్సి ఉంటుందని, ఇందుకోసం సుమారు రూ.70 లక్షలు ఖర్చవుతుందని పేర్కొంటూ అంచనాలను అప్పటి జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన జిల్లా కలెక్టర్‌కు పంపించారు. తర్వాత మెకానికల్ విభాగం అధికారులు ఐదు ప్రైవేటు ఏజెన్సీల నుంచి ఐదు 200 బ్రేకర్ జేసీబీలతో బీచ్‌లో నిర్మించిన కాంక్రీట్‌గోడను పునాదులతో సహా తొలగించే పనులను మార్చి ఎనిమిదిన ప్రారంభించి, 17 రోజులపాటు కొనసాగించారు. అప్పటికి 321 మీటర్ల గోడను తొలగించి, డెబ్రిస్‌ను కాపులుప్పాడలోని యార్డుకు తరలించారు. అంతవరకూ అయిన బిల్లు చెల్లిస్తేనేగానీ మిగిలిన పనులను పూర్తిచేయలేమని కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. తాను యంత్రాలను ఎంగేజ్ చేయలేదు కాబట్టి, బిల్లు పెట్టలేనంటూ భీమిలి జోన్ ఈఈ అభ్యంతరం వ్యక్తంచేశారు. దాంతో కాంట్రాక్టర్లు మెకానికల్ విభాగం అధికారులను సంప్రతిస్తే పనుల అంచనాలను పబ్లిక్ వర్క్సు ఈఈ...కలెక్టర్‌కు పంపించినందున అక్కడి నుంచే బిల్లు ప్రిపేర్ చేయాలని సమాధానం ఇచ్చారు. ఈలోగా మెకానికల్ ఈఈగా పనిచేసిన చిరంజీవి ఉద్యోగ విరమణ చేయగా, భీమిలి జోన్ ఈఈగా పనిచేసిన దిలీప్‌కుమార్‌కు జోన్-8కు బదిలీ అయిపోయింది. అనంతరం వచ్చిన అధికారులు బిల్లు పంచాయితీని ఒకరిపై ఒకరు నెట్టుకోవడం ప్రారంభించారు.

కమిషనర్‌కు ఫిర్యాదు

దీంతో కాంట్రాక్టర్లంతా గత నెల 30న జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి బిల్లు చెల్లింపులో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, వారి మధ్య సమన్వయలోపంపై ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ (ఫైనాన్స్)ను కమిషనర్‌ను ఆదేశించారు. అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో తాజాగా ఈనెల 21న జిల్లా కలెక్టర్‌ను కలిసి ఇంజనీరింగ్ అధికారుల తీరుపై ఫిర్యాదు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు తక్షణం పనులు ప్రారంభించాలని, తర్వాత వర్క్ ఆర్డర్‌ను ఇచ్చి ర్యాటిఫై చేయిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు తమను బలిచేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ పల్లంరాజును వివరణ కోరగా భీమిలి బీచ్‌లో నిర్మాణాల తొలగింపునకు సంబంధించిన బిల్లు చెల్లింపు విషయంలో మెకానికల్, పబ్లిక్ వర్క్సు ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లోపించిందని అంగీకరించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని, బిల్లు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని మెకానికల్, పబ్లిక్స్‌వర్క్సు అధికారులను ఆదేశించానన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అర్చకుడి అదృశ్యం కేసు దర్యాప్తునకు మరో బృందం

భీమిలి సీఐ తిరుమలరావు వెల్లడి

భీమునిపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చోడేశ్వరాలయం అర్చకుడు ఏడిద గణేష్ సుబ్రహ్మణ్యశర్మ కేసు దర్యాప్తును మరొకరికి అప్పగిస్తామని సీఐ తిరుమలరావు సోమ వారం తెలిపారు. శర్మ ఏప్రిల్ 24న ఇక్కడి నుంచి బయలుదేరి తిరుపతి వెళ్లారు. 26న స్వామి దర్శనం అయినట్టు భార్య మాధురికి ఫోన్‌లో తెలిపారు. తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ అయిపోయింది. అప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియలేదు. భీమిలి పోలీసులు జూన్ 13న మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తునకు హెచ్‌సీ ప్రసాద్‌ను నియమించారు. ఆయన ఆధ్వర్యంలో ఇరువురు కానిస్టేబుళ్లతో పాటు కుటుంబసభ్యులు తిరుపతి వెళ్లారు. అదృశ్యమైన అర్చకుడి స్మార్ట్ ఫోన్‌ను కనుగొన్నారు. బస్ చార్జీల కోసం రూ.700కు స్మార్ట్ ఫోన్‌ను అమ్మివేయగా, ఆ సెల్ నలుగురు చేతులు మారింది.

తిరుపతికి రెండు బృందాలు పంపుతాం

ఆ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని తీసుకురావడం జరిగింది. కాగా, తర్వాత ఎస్ఐ హరీష్‌ను దర్యాప్తు అధికారిగా ఈనెల ప్రారంభంలో నియమించారు. అయితే, ఆయ న్ను సిటీ టాస్క్ ఫోర్స్‌కు అధికారులు అటాచ్ చేసినందున...ఈ కేసు గురించి నార్త్ ఏసీపీ దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా మరో ఎస్ఐను నియమించి, రెండు టీమ్‌లను తిరుపతి పంపించాలని కోరనున్నట్టు సీఐ చెప్పారు. కాగా, సుబ్రహ్మణ్యశర్మ భార్య మాధురి, ఆమె కుటుంబీకులు తిరుపతి, కాశీ, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాలలో గాలిస్తున్నారని, ఇంకా జాడ తెలియలేదని సీఐ తెలిపారు. ఒక పక్క కుటుంబసభ్యులు, మరోపక్క డిపార్టుమెంట్ పరంగా తాము కూడా ప్రయత్నించి ఈ కేసు మిస్టరీని త్వరలో ఛేదిస్తామన్నారు.

ఆంక్షలు మూణ్నాళ్ల ముచ్చటేనా?

» బంకుల్లో విడిగా పెట్రోలు విక్రయాలు



స్కూటర్ డిక్కీలో బాటిల్‌లో, విడిగా క్యాన్‌లో పడుతూ..

మురళీనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గతంలో ఓ యువతిని పెట్రోల్ పోసి తగులబెట్టిన సంఘటన సంచలనం రేపిన నేపథ్యంలో పెట్రోల్ బంక్‌ల్లో లూజ్ పెట్రోల్ అమ్మకాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. క్యాన్లు, నీళ్ల సీసాల్లో పెట్రోలు పట్టి తీసుకెళ్లడం, వాహనాల్లో తరలించడం కుదరదని ప్రభుత్వం స్పష్టం చేసింది. పెట్రోలు బంకు నిర్వాహకులు ఈ ఆదేశాలు పాటించాలని ఉన్నతాధికారులు పేర్కొన్నా ఆంక్షల అమలు కొన్ని బంకుల్లో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఇటీవల మురళీనగర్ బిర్లాజంక్షన్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, ఆర్‌అండ్‌బీ హైవేలో జియో బర్నానీ పెట్రోలియం యాజమాన్యానికి తనిఖీల తర్వాత జిల్లా జాయింటు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. లూజ్ అమ్మకాల నిషేధం పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అయినా ఇపుడు మళ్లీ దాదాపు ప్రతి పెట్రోల్ బంక్‌లోనూ యథేచ్ఛగా పెట్రోలు లూజుగా అమ్మేస్తున్నారు. తాటిచెట్లపాలెంలో వైసీపీ నాయకుడికి చెందిన బంక్‌లో ఈ తరహా అమ్మకాలు నిత్యకృత్యంగా మారాయి. చుట్టూ నివాస సముదాయాల్ని ఆనుకొని ఉండే ఈ బంక్‌లో నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. అధికారులు చూసీచూడనట్టుగా మిన్నకుంటున్నారు. నిషేధఉత్తర్వులు బేఖాతరు చేస్తున్న పెట్రోల్ బంక్‌ల్లో కొనుగోలు సమయాల్లో వాహనాలతో వచ్చేవారికి ప్రమాదాలు తప్పేలా లేవని ద్విచక్రవాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేసే కంటే ముందస్తుగా నిబంధనలు పాటించేలా బంక్‌ల యజమానులను కట్టడి చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

విశాఖలో ఫిర్యాదుల పరిష్కారం భేష్

... 5వ పేజీ తరువాయి

పలువురు ఫిర్యాదు చేశారు. పెదజాలరిపేటలో గ్రామ కంఠంగా గుర్తించిన స్థలాలను ప్రజావసరాలకు అనుమతించాలని మత్స్యకార సంఘ నాయకులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం మంత్రి అనగాని మాట్లాడుతూ విశాఖ, తిరుపతిల్లో పీజీఆర్ఎస్ బాగా జరుగుతుందని, సమస్యల పరిష్కారంలో సానుకూలత ఉందన్నారు. ఇక్కడ అవలంబిస్తున్న విధానాలను చూసి మిగిలినచోట్ల అమలు చేసేందుకుగాను కార్యక్రమంలో భాగస్వామిని అయ్యానన్నారు. ప్రభుత్వ పథకాలు విశాఖలో బాగా అమలు జరుగుతున్నాయని ప్రశంసించారు. విశాఖ వాసులకు సానుకూల దృక్పథం ఎక్కువని, ఇక్కడ శాంతియుత వాతావరణం ఉండడంతో పెట్టుబడులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన నగరంగా విశాఖపట్నం నిలుస్తోందన్నారు. అందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖకు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారని, ఇదే విషయం తరచూ సమీక్షలలో గుర్తుచేస్తుంటారన్నారు.

ఐటీ రంగానికి ఊతమిస్తూ విశాఖ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని, ఫలితంగా చాలా కంపెనీలు వస్తున్నాయన్నారు. కాగా జిల్లాలో పీజీఆర్ఎస్ నిర్వహణ గురించి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వివరించారు. ప్రతి వారం వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత కాలంలో ఎండార్స్‌మెంట్ ఇస్తూ పరిష్కరిస్తున్నామన్నారు. ఇంకా క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహిస్తున్నామని, నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపుతున్నామన్నారు. పీజీఆర్ఎస్‌లో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు 427 ఫిర్యాదులు రాగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 180, తల్లికి వందనం పథకం అందలేదని సుమారు 80, జీవీఎంసీ సమస్యలపై 54 వచ్చాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

మురుగు పోయే దారే లేదాయె..

ఎక్కడికక్కడ నిలిచిపోతున్న వాడుక నీరు

తీవ్ర దుర్గంధం, దోమలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న 95వ వార్డు ప్రజలు

పెందుర్తి-రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఆవిర్భవించి సుమారు దశాబ్దంన్నర అవుతున్నా విలీన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడడం లేదు. ప్రధానంగా 95వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో మురుగు కాలువల నిర్మాణాన్ని చేపట్టకపోవడంతో మురుగు నీరు పారే దారిలేక స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శతాబ్ది నగర్, ఎస్ఏడీ లేఅవుట్, సాయిసౌదా నగర్, గొల్లవిల్లివానిపాలెం, లక్ష్మీపురం బీసీ కాలనీ, సాయినగర్, గవరపాలెం, తదితర కాలనీల్లో పలుచోట్ల మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. దీంతో నివాసితులు తమ ఇళ్ల ముందు సొంతంగా చిన్న కాలువల మాదిరిగా నిర్మించుకుని వాడుక నీటిని విడిచి పెడుతున్నారు. అయితే ఈ వాడుక నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే మార్గం లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు తిష్ట వేస్తోంది. పలుచోట్ల మురుగు నీరు రహదారులపైకి వస్తుండడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో భరించరాని దుర్వాసనతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, తద్వారా జ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పారిశుధ్య పనులు కూడా సిబ్బంది సజావుగా చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అందువల్ల ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు స్పందించి సమస్యల పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఎన్ఏడీ లేఅవుట్ నుంచి గొల్లవిల్లివానిపాలెం వెళ్లే రోడ్డులో నిలిచిన మురుగు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

▸▸ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు

కూర్మన్నపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర, నగరాభివృద్ధి సాధ్యమని టీడీపీ 70వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు పేర్కొన్నారు. వార్డు పరిధిలోని టీపీఎస్ కాలనీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పీబీఎల్ మూర్తి, పీఎంఎల్ నాయుడు, శ్రీనివాస్, ఎస్.రాజా, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: గ్రేటర్ 75వ వార్డు పరిధి దుర్గవానిపాలెంలో టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్యతో పాటు పరిశీలకుడు అరుగుల మణికుమార్, తదితరులు ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివద్ధిని, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి ఉరుకూటి అప్పలరాజు, నాయకులు బొంగు రాజు, కణితి సన్యాసమ్మ, పెద్దాడ సరోజని, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: ఇక్కడి బీసీ కాలనీ 12 బూత్ క్లస్టర్ పరిధిలో టీడీపీ శ్రేణులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తలారి శ్రీను, యుగంధర్, గీత, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



టీపీఎస్ కాలనీలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ 78వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి అడుసుమల్లి దీప్తి అన్నారు. 77, 78 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ, షాపుల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు అరుగుల మణి, కొల్లి నాగేశ్వరరావు, చింతయ్య, భార్గవి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా శ్మశానవాటిక

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న 14 గ్రామల ప్రజలు

పెదగంట్యాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో 14 గ్రామాలకు చెందిన శ్మశానవాటిక పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి అధ్వానంగా తయారైంది. దీంతో అంత్యక్రియలు జరిపేందుకు స్థలం కోసం వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటికకు వెళ్లే మార్గం కూడా తుప్పలతో నిండిపోవడంతో వాటిని నరుక్కుంటూ ముందుకు సాగాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు జీవీఎంసీ రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించింది. అయితే కొన్నాళ్లపాటు నత్తనడకన సాగిన పనులు ఆ తరువాత నిలిచిపోయాయి. ఇక్కడ విద్యుత్ బర్నింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని చేపట్టిన భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం శ్మశానవాటిక ప్రాంతం చిన్నపాటి చిట్టడవిలా మారిందని పలువురు వాపోతున్నారు. దీనిని ఆనుకుని ఉన్న ముస్లిం, క్రిస్టియన్ల బరియల్ గ్రౌండ్ల పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశానవాటికతో పాటు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు అసంపూర్తిగా వదిలేసిన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.



పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిన శ్మశానవాటిక

గోదాదేవికి ప్రత్యేక పూజలు

పెందుర్తి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వెంకటాద్రి శిఖరంపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవికి తిరునక్షత్ర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు తరలి వచ్చారు.



గోదాదేవి అమ్మవారు

వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరకులు పంపిణీ



వృద్ధురాలి బయోమెట్రిక్ తీసుకుంటున్న డీలర్

గోపాలపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ డిపోలను పునఃప్రారంభంతో పాటు వృద్ధులు, వికలాంగులకు ఇంటికే సరకులు పంపిణీ చేస్తున్నారు. దీంతో ఒకటో తారీఖు రాకముందే డీలర్లు వృద్ధులు, వికలాంగులకు ఇంటికే రేషన్ పంపిణీ చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు భూ పత్రాల పరిశీలన

వేపగుంట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎంఆర్‌డీఏ భూ పత్రాల పరిశీలన మంగళవారం, బుధవారం కొనసాగనున్నాయని వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. దూరప్రాంతాల్లో నివాసముంటున్న రైతుల సౌకర్యం కోసం మరో రెండు రోజులు పొడిగించామని, ఈ అవకాశాన్ని వినియోగం చేసుకోవాలని కోరారు.

పీజీఆర్ఎస్‌కు 15 ఫిర్యాదులు

వేపగుంట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 15 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో యూజీడీ డ్రైనేజీ నిర్మించాలని, 91వ వార్డు బాజీజంక్షన్‌లో కాలువ ఆక్రమణను అదుపు చేయాలని, లక్ష్మీనగర్‌లో అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని, 92వ వార్డు వెంకటాపురంలో ఇంటిపన్నుల్లో మార్పులు చేయాలని, 94వ వార్డులో కొత్త మంచినీటి పైప్‌లైన్ వేయాలని, 97వ వార్డులో 'ఏ' జోన్ పార్కు ప్రాంతంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖాధిపతులకు పంపిస్తామని జడ్సీ కే.హైమావతి తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సు

మల్కాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పు వచ్చినప్పుడు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ అన్నారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలోని ఉన్న వివిధ పాఠశాలల్లో సీజల్ వ్యాధుల పట్ల సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య భద్రతపై శ్రద్ధ చూపాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాని సూచించారు. శుక్రవారం 'డ్రైడే' పాటించాలని కోరారు. వర్షాకాలంలో ప్రజలు మరిన్ని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్

నేడు పీఏసీఎస్ ఛైర్మన్‌గా 'అయితి' ప్రమాణ స్వీకారం

పెందుర్తి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఛైర్మన్‌గా అయితి సింహాచలం నాయుడు మంగళవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఉదయం పది గంటలకు స్థానిక తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ప్రమాణస్వీకారం అనంతరం ఛైర్మన్‌గా అయితి, డైరెక్టర్లుగా చిరికి అవతారం, ఉగ్గిన అచ్చిబాబు బాధ్యతలు స్వీకరించనున్నారు.



అయితి సింహాచలం నాయుడు

విత్తన రాఖీలు తయారీపై అవగాహన



విత్తన రాఖీలతో విద్యార్థులు, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధులు

పెందుర్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం రాఖీ పౌర్ణమికి విత్తన రాఖీలను వినియోగించాలని 'గ్రీన్ క్లైమేట్ టీం' వ్యవస్థాపక కార్యదర్శి జేవీ.రత్నం పిలుపునిచ్చారు. స్థానిక బాలికల వసతి గృహంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థులకు విత్తన రాఖీల తయారీ విధానం నేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతిని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, సీటీజీ గార్డెన్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విజ్ఞాన్ ఛైర్మన్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న విద్యార్థినులు

అగనంపూడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ విద్యా సంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలను ఇక్కడి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ అరుంధతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా, పలువురు రక్తదానం చేశారు. అలాగే కాలేజీలో మొక్కలను నాటడంతో పాటు స్థానికంగా గల అనాథాశ్రమంలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. వారికి నిత్యావసర సరకులతో పాటు స్టేషనరీ, క్రీడా సామగ్రిని అందజేశారు. అలాగే దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో రత్తయ్య జన్మదిన వేడుకలను చేపట్టారు. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్ఎస్ కోసం నిరీక్షణ

ఉక్కుటౌన్‌షిప్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో రెండో దశ వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులందరూ తీవ్ర ఆందోళనలో ఉన్నారు. తమకు వీఆర్ఎస్ వస్తుందా, రాదా? అని ఎదురుచూస్తున్నారు. ప్లాంటులో తొలిదశ వీఆర్ఎస్ ప్రకటించినప్పుడు 1,630 మంది దరఖాస్తు చేసుకోగా.. 1,130 మందికి వీఆర్ఎస్ వర్తింపజేశారు. సంస్థలో 15ఏళ్ల సర్వీసు పూర్తయి 45 ఏళ్లు దాటిన వారు రెండోసారి వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా యాజమాన్యం పేర్కొంది. దీంతో 1,152 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 1,040 మంది దరఖాస్తులను యాజమాన్యం అంగీకరించింది. అయితే ఇందులో ఎంతమందికి వీఆర్ఎస్ వర్తింపజేస్తారోనని అందరూ వేచిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి చాలా తక్కువ మందికి ఉక్కు యాజమాన్యం వీఆర్ఎస్ ఇచ్చే అవకాశం ఉందని ప్రధాన కార్మిక సంఘం నాయకుడు ఒకరు తెలిపారు.



పుష్పాలంకరణలో గోదాదేవి

గోదాదేవికి తిరు నక్షత్ర పూజలు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం తిరుప్పావై సేవ, అర్చన, మంగళాశాసనం, తదితర పూజాది కార్యక్రమాలను చేపట్టారు. అర్చకులు ఉదయం శ్రీవారిని, గోదాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా, పరిసర ప్రాంతాలకు భక్తులు దర్శించుకున్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

అగనంపూడి: గ్రేటర్ 79వ వార్డు పరిధి జాబిలి హిల్స్‌లో గల ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన, భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గొల్లవిల్లి వెంకటరావు, సూర్యనారాయణ, గురునాథం, కల్పన, విశాలక్ష్మి, నాగలక్ష్మి, శ్రీదేవి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజువాక, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చినగంట్యాడ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపట్టనున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ టీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా కోర్టు ప్రాంగణం, జీవీఎంసీ జోన్ కార్యాలయం, తహశీల్దార్ ఆఫీసు, ఆర్కే ఆస్పత్రి, చినగంట్యాడ, ఎస్సీ కాలనీ, స్నేహపురి కాలనీ, పాత మీ-సేవా కేంద్రం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం

కూర్మన్నపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలందిచడం ఎంతో మేలైన మార్గమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ డి.సూర్యప్రకాశ్ అన్నారు. కూర్మన్నపాలెంలో సోమవారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం 2025-26 ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా లక్కరాజు సోంబాబు, కార్యదర్శిగా కెప్రసాద్‌నాయుడు, కోశాధికారిగా బి.లక్ష్మణ్‌రెడ్డి, సభ్యులుగా కేవీ ప్రసాద్, రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోంబాబు మాట్లాడుతూ క్లబ్‌కు మంచిపేరు తెచ్చేలా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ జోన్ ఛైర్‌పర్సన్ ఎ.మురళీధరరెడ్డి, డీఎస్ఎస్‌బీ వర్మ, శివశంకరరావు, శ్రీనివాసరావు, ఎ.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీ వెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

● **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 40, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 34, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 26, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 44, దొండకాయలు 26, బంగాళదుంపలు 16, అరటికాయ(పె) 10, మునక్కాడలు(కిలో) 42, అల్లం (పాతది) 66, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్ధచిక్కుడు 50, దోస కాయలు 14, వెల్లుల్లి(పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద42, గోరుచిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్క కూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిదగుమ్మడికాయ 20, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194



73వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పల్లా శ్రీనివాసరావు

కూటమి హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై అన్ని విధాల నష్టపోయిన ఉత్తరాంధ్రను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 73వ వార్డు పరిధి పైడిమాంబ కాలనీలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు దోచుకోవడం-దాచుకోవడమే లక్ష్యంగా పనిచేశారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని, అందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గాజువాకను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని పల్లా పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, తెలుగు యువత అధ్యక్షుడు బలగ బాలునాయుడు, నాయకులు కురందాస్ కృష్ణ, మొల్లి ప్రకాశ్, పెంటారావు, అజయ్‌కుమార్, గోపి, బాబా, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడలో ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటు

నేడు ప్రారంభించనున్న సీపీ, డీఆర్ఎం



కూర్మన్నపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. ఇక్కడ ఆటోడ్రైవర్లు ప్రయాణికుల నుంచి అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారంటూ దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజా సంఘ నాయకులు అనేకసార్లు ఫిర్యాదులు, వినతులు చేసిన నేపథ్యంలో రైల్వే ఉన్నతాధికారులు స్పందించి నాలుగో ప్లాట్‌ఫారం సమీపంలో ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ఆటో చార్జీలను నిర్ణయించే బాధ్యతను దువ్వాడ రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావుకు అప్పగించారు. ప్రీపెయిడ్ ఆటోలు నడిపేందుకు ముందుకు వచ్చే డ్రైవర్లు రోజుకు రూ.5 చొప్పున రైల్వేకు చెల్లించాలి. కాగా మంగళవారం ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ డీఆర్ఎం లలిత్ బోహ్ర ప్రారంభించనున్నట్టు సీఐలు కె.మల్లేశ్వరరావు, కె.వెంకటరావులు తెలిపారు. ఎట్టకేలకు ఇక్కడ ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేయడం పట్ల తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.

'విద్యుత్ చార్జీలను తగ్గించాలి'

మల్కాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతోందని, ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని సీపీఎం నాయకుడు పి.పైడిరాజు, సీపీఐ నాయకుడు కె.సత్యాంజనేయ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. వైసీపీ హయాంలో విద్యుత్ చార్జీలను పెంచితే 'బాదుడే-బాదుడు' అనే కార్యక్రమాన్ని టీడీపీ చేపట్టిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత చార్జీలు పెంచడం దారుణమని అన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం వల్ల ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, అందుకు అవి వద్దంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పెరిగిన జీతాలు అమలు చేయండి

జీవీఎంసీ కమిషనర్‌కు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ నీటిసరఫరా విభాగంలో అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పెరిగిన జీతాలు చెల్లించాలని కోరుతూ కాంట్రాక్టు, లేబర్ యూనియన్ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు కేటగిరీ ప్రకారం రూ.మూడు వేలు చొప్పున జీతాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21న జీవో జారీచేసింది. ఆ మేరకు జీతాలను పెంచాలని సోమవారం కమిషనర్‌ను కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం పాల్గొన్నారు.

జీవీఎంసీకి 174 వినతులు

వెంకోజీపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జీవీఎంసీ అన్ని విభాగాలకు సోమవారం 174 అర్జీలు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాస రావు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి మేయర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీలను/ఫిర్యాదులను అదేరోజు వెంటనే విభాగాధిపతులు పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదుదారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. ప్రతివారం అందే ఫిర్యాదులు మళ్లీ రాకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జీవీఎంసీ అధికారులను, జోనల్ కమిషనర్లను కమిషనర్ ఆదేశించారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏపీపీగా రాజశేఖర్



ఏపీపీ రాజశేఖర్

విశాఖపట్నం లీగల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ప్రత్యేకకోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పోక్సో కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిన రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుత ఏపీపీ బీవీఆర్‌మూర్తి పదవీకాలం ముగియడంతో అతనిని ప్రభుత్వం తొలగించింది. దీంతో ఈ బాధ్యతలను రాజశేఖర్‌కు అప్పగించింది.

పీపీ, ఏపీపీల తొలగింపు

జిల్లా ప్రధాన కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేసిన కాండ్రేగుల జగదీష్, గాజువాక కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, 13వ జిల్లా కోర్టు అదనపు ప్రాసిక్యూటర్ ఎం.పావనిల పదవీ కాలం ముగిసింది. దీంతో వారిని పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

1 నుంచి పలు రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొన్ని రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సంబల్‌పూర్-నాందేడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఆగస్టు 1 నుంచి 31 వరకు (నామినేటెడ్ రోజుల్లో), తిరుగు ప్రయాణంలో ఇదే ఎక్స్‌ప్రెస్‌కు ఆగస్టు 2 నుంచి సెప్టెంబరు ఒకటి వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు జత చేస్తారు. భువనేశ్వర్-జునాగఢ్ ఎక్స్‌ప్రెస్‌కు ఆగస్టు 1 నుంచి 10 వరకు, తిరుగు ప్రయాణంలో ఆగస్టు 2 నుంచి 11 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తారు. విశాఖ-గుణుపూర్ పాసింజర్‌కు రెండు వైపులా ఆగస్టు 1 నుంచి 31 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తారు. విశాఖ-కిరండూల్ పాసింజర్‌కు ఆగస్టు 1 నుంచి 31 వరకు, తిరుగు ప్రయాణంలో ఆగస్టు 2 నుంచి సెప్టెంబరు 1 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తామని డీసీఎం పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం వదిలి... విలక్షణ నటుడిగా!



సినీ నటుడు సత్యసాయి శ్రీనివాస్

- 130కి పైగా సినిమాల్లో పలు పాత్రలు
- అగ్రహీరోలతో కలిసి పనిచేయడం ఆనందం
- క్యారెక్టర్ ఆర్టిస్టు డా.వడ్లమాని సత్యసాయిశ్రీనివాస్

డాబాగార్డెన్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వ ఉద్యోగం. సమాజంలో గౌరవం ఉన్నాయి. కానీ ఏదో అసంతృప్తి... తనలోని నటుడిని ప్రజలకు చూపించాలనే తపన. దీంతో సినిమాల్లో పాత్రల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రితో ఉన్న అనుబంధంతో వెండితెరకు పరిచయమయ్యారు. 2014లో అరంగేట్రం చేసి 11 సంవత్సరాల వ్యవధిలో 130కి పైగా సినిమాల్లో వివిధ పాత్రలు పోషించారు డా.వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్. నగరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సినీ రంగంలో తన అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.**

విశాఖ డీఆర్‌డీఏ పీడీగా 2014 నుంచి 2019 వరకు పనిచేశాను. అయితే సినిమాల్లో నటించాలనేది ఎప్పటినుంచో కోరిక. దీంతో తీవ్రంగా ప్రయత్నాలు సాగించడంతో దర్శకుడు కల్యాణ్‌కృష్ణ 2014లో రారండోయ్ వేడుక చూద్దాం సినిమాలో అవకాశం ఇచ్చారు. ఆ తరువాత మహానుభావుడు చిత్రంలో దర్శకుడు మారుతి మంచి పాత్ర ఇవ్వడంతో సినిమాల్లో నిలదొక్కుకున్నాను. ఈ నేపథ్యంలో 2019లో ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి సినిమా రంగాన్నే నమ్ముకోవడంతో ఇప్పటివరకు 130కి పైగా సినిమాల్లో నటించాను. అగ్ర హీరోలందరితో పనిచేసే అదృష్టం దక్కిందని శ్రీనివాస్ తెలిపారు.

సినిమాల్లోకి ధైర్యం చేసి వచ్చాను. డీఆర్‌డీఏ పీడీగా విశాఖలో పనిచేస్తున్నా ఉద్యోగ జీవితం తృప్తినివ్వలేదు. నటుడు కావాలనే నా కోరికను గ్రహించిన హీరో జగపతిబాబు బాగా సపోర్టు చేశారు. సినిమాల్లో రాణించాలంటే నటనతో పాటు భాషపై పట్టు, వివిధ పాత్రలకు తగ్గట్టుగా ముఖవర్చస్సు ఉండాలన్నారని, అదే సమయంలో అదృష్టం కూడా ఉండాలని దృఢంగా నమ్ముతానన్నారు.

ప్రస్తుతం చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నాని, ఈ పాత్రను చాలెంజ్‌గా తీసుకున్నానని తెలిపారు. మంచి పేరు వస్తుందని నమ్ముతున్నానని, మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటించడం అదృష్టంగా భావిస్తున్నాన్నారు. ఇంకా ప్రభాస్, రామ్‌చరణ్ పెద్ది, అఖిల్ లెనిన్ సినిమాలతో పాటు చిత్రీకరణ దశలో ఉన్న మరిన్ని సినిమాల్లో నటిస్తున్నానన్నారు. చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, బాలకృష్ణ లాంటి అగ్రనటులతో కలిసి పనిచేసే అవకాశం చాలా వేగంగా వచ్చిందని, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో వెంకటేష్‌తో ఎక్కువ రోజులు పనిచేయడం జీవితంలో మరచిపోలేనన్నారు. అగ్రనటులతో పాటు దర్శకులు, రచయితలతో స్నేహంగా మెలుగుతుండడం, దర్శకులకు టచ్‌లో ఉండడంతో మంచి పాత్రలే దక్కుతున్నాయన్నారు. ఈ సందర్భంగా అవకాశం ఇచ్చిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విశాఖ ప్రజలు చూపించిన ప్రేమాభిమానాలకు రుణపడి ఉంటానని, ఏదైనా ప్రాంతానికి వెళ్లే సమయంలో ఆయా సినిమాల్లోని పాత్రల పేర్లతో తనను పిలవడం చాలా ఆనందాన్ని ఇస్తోందని ముగించారు.

ప్రతి కార్యకర్తను పార్టీ గుండెల్లో పెట్టుకుంటుంది

- ఎమ్మెల్సీ నాగబాబు హామీ

సీతంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలపై పోరాడాలని, జనసేన ప్రతి కార్యకర్తను పార్టీ గుండెల్లో పెట్టుకుంటుందని ఎమ్మెల్సీ కె.నాగబాబు అన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని



ఎమ్మెల్సీ నాగబాబును అభినందిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, చిత్రంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాగబాబు మాట్లాడారు. కూటమి సమన్వయంతో సమర్థంగా పరిపాలిస్తుందని, చిన్న చిన్న లోపాలుంటే వాటిని సమన్వయ కమిటీ పరిష్కరిస్తుందన్నారు. తనకు ఎటువంటి పదవి మీద ఆశ లేదని, కార్యకర్తగా పనిచేయడం ఇష్టమని తెలిపారు. జనసేనకు దామాషా ప్రకారం నామినేటెడ్ పదవులు వస్తాయని, కొద్దిరోజుల్లో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్ల ఎమ్మెల్సీ పదవిని వదులుకుని నాగబాబు వల్లే తాను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిచానని అన్నారు. జనసేన పార్టీకి, పవన్ కల్యాణ్‌కి రుణపడి ఉంటానన్నారు. ఈ సమావేశంలో రూరల్ అధ్యక్షుడు, పెందుర్తి శాసనసభ్యుడు పంచకర్ల రమేష్‌బాబు, వివిధ హోదాల్లో ఉన్న జనసేన నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నాగబాబుకు ఉత్తర ఎమ్మెల్యే సత్కారం

నగరానికి విచ్చేసిన ఎమ్మెల్సీ, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును జనసేన పార్టీ కార్యాలయంలో బీజేపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖకు తల్లికి వందనం తలనొప్పి

పలు కారణాలతో సొమ్ములు జమ కాక పీజీఆర్ఎస్‌లో తల్లుల ఫిర్యాదు



సొమ్ములు జమకాలేదని అధికారికి ఫిర్యాదు చేస్తున్న మహిళలు

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం కింద పాఠశాలల్లో చదువుకునే పిల్లల తల్లులకు ఖాతాలకు సొమ్ములు జమకాని వ్యవహారం విద్యాశాఖకు తలనొప్పిగా పరిణమించింది. విద్యాశాఖ, గ్రామ, వార్డు సచివాలయాల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. పలు కారణాలతో ఖాతాకు సొమ్ములు జమకాకపోవడంతో తల్లులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో పలువురు ఫిర్యాదు చేశారు. అర్హులమైనా సొమ్ములు జమకాలేదన్నారు. విద్యాశాఖ, సమగ్రశిక్షా అభియాన్ శాఖల అధికారులు ప్రతి ఫిర్యాదును పరిశీలించారు. విద్యాహక్కు చట్టం కింద ఉచితంగా సీటు వచ్చిన తరువాత పాఠశాల బాగాలేదని చేరని పిల్లల తల్లులకు పథకం హోల్డ్‌లో పెట్టారు. ఒకే ఇంట్లో అన్న/అక్కకు ఉచిత సీటు కేటాయిస్తే అదే ఇంట్లో తమ్ముడు/చెల్లికి పథకం అందలేదు. కొందరికి బ్యాంకు ఖాతాకు ఆధార్‌నంబరుకు అనుసంధానం కాకపోవడంతో సమస్య ఎదురయింది. మూడు వారాలుగా 60 నుంచి 80 మంది తల్లులు కలెక్టరేట్‌లో ఫిర్యాదుచేస్తున్నారు. దీనిపై సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ చంద్రశేఖరరావు మాట్లాడుతూ పలు కారణాలతో 450మంది తల్లుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టారన్నారు. కారణాలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎంఈవోలను కలెక్టరేట్‌కు పిలిపించి వారి సమక్షంలోనే ప్రతి అర్జీని పరిశీలించి తప్పులు గుర్తిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా సీట్లు కేటాయించిన నేపథ్యంలో విద్యార్థులు అక్కడ చదువుతున్నారా లేదా అనేది సర్వేచేస్తున్నామన్నారు. హోల్డ్‌లో ఉన్న తల్లుల ఖాతాలకు వచ్చేనెలలో సొమ్ములు జమ అవుతాయన్నారు.

పాములు, కుక్కలతో వినూత్న నిరసన

- జీతాలు పెంచాలని వెటర్నరీ కార్మికుల డిమాండ్



పాములతో నిరసన తెలుపుతున్న కార్మికులు

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వెటర్నరీ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు పాములు, కుక్కలు, గేదెలతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. జీవీఎంసీ పరిధిలో రోడ్లపై తిరిగే పశువులు, వీధి కుక్కలతోపాటు జనావాసాల్లోకి వచ్చే పాములను పట్టుకునేందుకు జీవీఎంసీ కాంట్రాక్టు పద్ధతిలో (కాంట్రాక్టర్ ద్వారా) కొంత మందిని నియమించుకుంది. వారికి జీవోనంబరు 36 ప్రకారం పెంచిన జీతాలను అమలుచేయాలని సీఐటీయూ ఎప్పటినుంచో పోరాడుతోంది. గతనెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు ఈఅంశాన్ని లేవనెత్తడంతో వేతనాలు పెంపునకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అయితే ఇప్పటికీ తీర్మానం అమలుకాకపోవడంతో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు పాములు, కుక్కలు, గేదెలను తీసుకొచ్చి రోడ్డుపై వుంచి వినూత్న నిరసన తెలిపారు. అనంతరం మేయర్, కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పాములను రోడ్లపై ఆడించడంతో జనం ఆసక్తిగా తిలకించారు. ఎండవేడికి పాములు సొమ్మసిల్లడంతో నీరు తాగించారు.

గుడి, రహదారి ఆక్రమణ



రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన ఫలహారశాల



వినాయకుడి ఆలయం ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణం

- దర్జాగా దుకాణం నిర్వహణ
- వాహనదారుల రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

సాగర్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రహదారి పక్కన వ్యాపారం సాగిస్తున్న కొందరు దుకాణాల యజమానులు రోడ్డును ఆక్రమించడం ఆనవాయితీగా మారిపోయింది. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ ఆక్రమణలు యథేచ్ఛగా సాగిపోతున్నారు. ఈ కోవలో సాగర్‌నగర్ అల్లూరి సీతారామరాజు విగ్రహం కూడలి వద్ద ఓ ఫలహారశాల యజమాని గుడిని సైతం ఆక్రమించి వ్యాపారం సాగిస్తుండటంతో అక్కడి వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడితో పాటు సుమారు పదిఅడుగుల రహదారిని ఆక్రమించడంతో అక్కడి కి వచ్చే సరికి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇది కూడలి కావడంతో బీచ్‌రోడ్డు వైపు వెళ్లాల్సిన వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. సీతారామరాజు విగ్రహం కింద ఉన్న సిమెంట్ ఫలకాలను ఢీకొడుతున్నాయి. వినాయకుడి గుడిని ఆక్రమించి మరీ ఫాస్ట్ ఫుడ్‌సెంటర్ నిర్వహించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవుడిని దర్శించుకోవడానికి వీలు పడడం లేదని భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. గుడిని ఆక్రమించి మరీ మాంసాహారం సిద్ధం చేస్తుండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రదీప్ కుమార్ (ఫైల్ ఫొటో)

ఆనందపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన గిడిజాల-ముచ్చర్ల రహదారిపై సోమవారం జరిగింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాల మేరకు.. వేపగుంట సమీపంలోని ముత్యమాంబ కాలనీకి చెందిన మామిడి ప్రదీప్ కుమార్ (25) పనిమీద తన పల్సర్ బైక్‌పై పద్మనాభం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ముచ్చర్ల - గిడిజాల రహదారిపై అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ప్రదీప్‌కుమార్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి మామిడి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు సీఐ కేశవరావు, వెనుక నిందితులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ లారీ స్టాండ్‌లో ఈ నెల 26న జరిగిన హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సీఐ ఇ.కేశవరావుతో కలిసి వివరాలు వెల్లడించారు. దేశపాత్రునిపాలెం ప్రాంతానికి చెందిన మొల్లి సంతోష్‌కుమార్ తన కుమార్తెను తీసుకురావడానికి పెదగంట్యాడ వెళ్లాడు. రాత్రి ఏడు గంటలకు స్కూల్ విడిచిపెడతామని చెప్పడంతో స్నేహితులను కలిసేందుకు సమీపంలో ఉన్న లారీ యార్డ్‌కు వెళ్లాడు. ఈ సమయంలో అక్కడ కొంతమంది అతడిపై దాడి చేసి గాయపర్చారు. దీనిపై స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితులు పరారవడంతో మూడు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టి పెదగంట్యాడకి చెందిన మొల్లి శివకృష్ణ, మీసాల రవి, వియ్యపు ప్రవీణ్, గెంజలి మనోజ్, ముచ్చి తరుణ్, సిరసపల్లి జీతేంద్రకుమార్ దాడి చేసినట్టు గుర్తించి అరెస్టు చేశారు.

పీఅండ్‌టీ కాలనీలో కారు టైర్లు చోరీ



కారు టైర్లను చోరీ చేసిన దృశ్యం

సీతంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పీఅండ్‌టీ కాలనీలో ఎన్ఎంసీహెచ్ స్కూల్ ప్రహరీ పక్కనే పార్కు చేసిన ఒక ఖరీదైన కారు నాలుగు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పీఅండ్‌టీ కాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉద్యోగి తన కారును స్కూల్ గోడ పక్కన రోడ్డుపై రోజూ పార్కు చేస్తుంటాడు. ఆదివారం కారును అక్కడే నిలిపాడు. సోమవారం ఉదయం చూసేసరికి కారుకు ఉన్న నాలుగు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు విప్పి దొంగలించుకుపోయారు. దీంతో ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు చుట్టు పక్కల సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

సీపీ కార్యాలయం వద్ద వ్యక్తి హల్‌చల్

- ఫిర్యాదు చేసేందుకు వచ్చి ఆత్మహత్యాయత్నం



పవన్‌కుమార్‌ను తీసుకెళ్తున్న పోలీస్

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) వద్ద ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఏఆర్‌బ్యారెక్స్‌లోని పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న వేదికవద్దకు పవన్‌కుమార్ పెట్రోల్‌బాటిల్‌తో వచ్చాడు. తనను సంజయ్‌రెడ్డి అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.7లక్షలు తీసుకుని మోసం చేశాడని, ఫోర్త్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేస్తే పట్టించుకోలేదని, తిరిగి తనపైనే కేసు నమోదుచేస్తానని బెదిరిస్తున్నారంటూ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడి సిబ్బంది పెట్రోల్ బాటిల్‌ను లాక్కుని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అన్యాయం జరిగితే ఫిర్యాదు చేయాలని, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇరువర్గాలతో మాట్లాడి సమస్య తెలుసుకోవాలని సీపీ పోలీసులను ఆదేశించారు.

నా భూమిని బలవంతంగా లాక్కున్నారు

- ఆక్సిజన్ సిలిండర్‌తో వచ్చి కలెక్టర్‌కు బాధితుడి ఫిర్యాదు



ఆక్సిజన్ సిలిండర్‌తో వచ్చి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితుడు

మహారాణిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తన భూమిని ఆక్రమించారని, న్యాయం చేయాలని కోరుతూ గాజువాకకు చెందిన ఎస్.శ్రీనివాసరావు ఆక్సిజన్ సిలిండర్‌తో వచ్చి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించాడు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆక్సిజన్ సిలిండర్‌తో, మాస్కు ధరించి వచ్చిన శ్రీనివాస రావు వినతిపత్రాన్ని అందజేశాడు. తాను రబ్బరు ఫ్యాక్టరీలో పని చేస్తున్నా నని, అనారోగ్య కారణాలతో ఊపిరితిత్తులు పాడయ్యాయని మూడేళ్లుగా ఆక్సిజన్ పెట్టుకొనే నెట్టుకొస్తున్నానన్నాడు. దువ్వాడలో తనకు 51 సెంట్ల భూమి ఉందని, దానిని తప్పుడు డాక్యుమెంట్లతో నాలుగేళ్ల క్రితం ఆక్రమించారని, న్యాయం చేయాలని ఫిర్యాదు చేశాడు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద కార్మికులు ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. సుమారు 46 వేల క్లెయిములకు నిధులు విడుదల చేయక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

అంగన్‌వాడీలకు పనిభారం తగ్గించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. అనంతరం అధికారులకు 13 డిమాండ్లతో వినతిపత్రాన్ని అందజేశారు. యాప్‌లతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.